మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట



## ఎలక్ట్రానిక్ ఓటు వినియోగంపై అవగాహన కల్పించాలి:జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**నారాయణపేట ప్రతినిధి, జులై 20 ప్రభాతవార్త:** గురువారం కలెక్టరేట్‌లో ప్రజావాణి హాల్ లో డిమాంస్ట్రేషన్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రారంభించారు. కంట్రోల్ యూనిట్, బ్యాలెట్‌యూనిట్, వివిప్యాట్‌లద్వారా ఓటువినియోగంపై ప్రజలకు ఇవ్వాల్సిన అవగాహన చేపట్టాల్సిన జాగ్రత్తలపై జిల్లా కలెక్టర్ వివరించారు. కలెక్టర్‌మాట్లాడుతూ జిల్లాలో కంట్రోల్ యూనిట్, బ్యాలెట్‌యూనిట్, వివిపాట్‌ల ద్వారా ఓటువినియోగం గురించి ప్రజలకు స్పష్టతను ఇచ్చి అవగాహనను కల్పించేదిశగా(20జులై, 2023) గురువారం నుండి ప్రారంభించనున్న అవగాహన కార్యక్రమాలను సిబ్బంది విజయవంతం చేయాలన్నారు. అవగాహనను కల్పించే దిశగా మక్తల్ నియోజకవర్గంతో పాటు ఆర్డీఓ కార్యాలయంలో కలుపుకుని ఈవిఎం డిమోస్ట్రేషన్ కేంద్రాలను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. అదేవిధంగా రెండు వాహనాల చొప్పున కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వివిప్యాట్ ద్వారా గ్రామ పంచాయతీలలో అవగాహన కల్పించడం జరుగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ పి. అశోక్‌కుమార్, ఆర్డీఓ రాంచందర్, జిల్లా అధికారులు, తహసిల్దార్ దానయ్య, ఏఓ నర్సింగ్‌రావు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఓటు వేసే విధానంపై అవగాహన తప్పనిసరి..

- జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్
- ఈవీఎం, వీవీప్యాట్‌ల ప్రదర్శన కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 20 ప్రభాతవార్త:** ఈవీఎం, వీవీప్యాట్‌ల ద్వారా ఓటు వేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. నాగర్‌కర్నూల్ సమీకృత కార్యాలయ సముదాయ ఆవరణలో ఈవీఎం, వీవీప్యాట్‌ల ప్రదర్శన కేంద్రాన్ని గురువారం కలెక్టర్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి ప్రతి రోజు కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు ఓటే వేసే విధానంపై అవగాహన కల్పించి వారి సందేహాలను నివృత్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రతిరోజు ఎంతమంది ఓటింగ్‌లో పాల్గొన్నారు, వారి వివరాలతో పాటు రిజిస్ట్రర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి రోజు సాయంత్రం పోలైన ఓట్ల వివరాలను తెలుపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట నియోజకవర్గాలకు ఒకటి చొప్పున మూడు ప్రచార రథాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నోడల్ అధికారి గోవిందరాజులు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జాకీర్ అలీ, నాయబ్ తహసీల్దార్ ఎలక్షన్ రాఘవేందర్, ఎన్నికల సిబ్బంది కరుణాకర్ తదితరులు ఉన్నారు.



## కరెంటు కష్టాలకు కారణమే కాంగ్రెస్..

**తెలంగాణను సస్యశ్యామలం చేసిన ఘనత బిఆర్‌ఎస్‌దే**

**అలంపూర్ ఎమ్మెల్యే డా.వి.ఎం అబ్రహాం**

**అలంపూర్, జులై 20 ప్రభాతవార్త:** రైతులకు ఉచిత కరెంటుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ వైఖరిని నిరసిస్తూ అలంపూర్ మండలం లింగన్‌వాయి గ్రామంలో రైతు వేదికలో రైతులతో కలిసి నిర్వహించిన సమావేశానికి అలంపూర్ ఎమ్మెల్యే డా. వి.ఎం అబ్రహం పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతువ్యతిరేక వ్యాఖ్యలపై మండిపడ్డారు. గతంలో కరెంటు కష్టాలకు కారణమే కాంగ్రెస్ అన్నారు. వారి అసమర్థ, దుష్ట,దుర్మార్గ పాలన వల్లే రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. వ్యవసాయాన్ని దండగ చేసిన పాపం ఆ పార్టీదేనని ఉచిత విద్యుత్‌పై రేవంత్ వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయన్నారు. కాకపోతే, కాంగ్రెస్ వస్తే మాత్రం మళ్లీ ఆ కష్టకాలం రాక తప్పదని అన్నారు. సాగునీరు అందక, ప్రాజెక్టులు లేక, భూగర్భజలాలు అడుగంటి, తాగునీటికి కూడా తల్లడిల్లారు. కరెంటు కష్టాలు, కోతలతో, పవర్ హాలీడేలతో తల్లడిల్లినామని, సాగునీరు లేక, కరెంటు రాక ఇబ్బందులు పడ్డామన్నారు. రైతులు ఆత్మహత్యలు చేసుకునే దుర్మార్గ పాలన ఆనాడు సాగిందని అందుకే ఆనాడు టిడిపి అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత కొంతకాలం కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే, మళ్లీ అవే పరిస్థితులు దాపురించాయన్నారు. ప్రజలు కొట్లాడి తెలంగాణ తెచ్చుకున్నారు. సీఎం నాయకత్వం వహించారు. సీఎం కెసిఆర్ పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేసి, కాళేశ్వరంవంటి ప్రపంచంలోనే అతిగొప్ప ప్రాజెక్టులు కట్టి, అతి త్వరలోనే మన నియోజకవర్గంలో కూడా మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణపనులను కూడా ప్రారంభించుకోబోతున్నాం అని అలాగే కెనాల్‌లో జంగిల్ కటింగ్ షీల్డ్, స్ట్రక్చర్స్ ఆధునీకరణ పనులకోసం 13కోట్ల రూపాయలు మంజూరు చేశారు. ఆ పనులు కూడా దాదాపుగా పూర్తికావడం జరుగుతుంది. పోయిన సంవత్సరం ఆర్డీఎస్ కెనాల్‌చివరి ఆయకట్టువరకు నీరందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



## కల్వకుర్తి అభివృద్ధికి సహకరించాలని మంత్రి హరీష్‌రావును కోరిన ఎమ్మెల్యే

**కల్వకుర్తి, జూలై 20 ప్రభాతవార్త:** కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావును ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందించారు. కల్వకుర్తి 100పడకల ఆసుపత్రి నిర్మాణానికి స్థల సేకరణ చేసి 3 ఎకరాల భూమి వైద్య ఆరోగ్య శాఖకు అప్పగించినట్లు తెలిపారు. ఆమనగల్లులో 50 పడకల ఆసుపత్రి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా జంగారెడ్డిపల్ల నుంచి మాడ్గుల నాగిల్ల వరకు వెళ్లే కేఎల్ఐ డీ-82 కాలువలలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం రూ.16కోట్ల 50లక్షల రూ॥లను విడుదల చేయాలన్నారు. వెల్దండ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.50లక్షలు మంజూరు చేయాలని, కడ్తాల్ నుంచి పడకల్ వరకు రూ.20కోట్లతో నూతనంగా నిర్మించే బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని మంత్రిని కోరగా... స్పందించిన మంత్రి నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తానన్నారు.



## గొర్రెల పంపిణీ పథకం యాదవులకు కానుక...

- మన్నెవారిపల్లి గ్రామంలో 2వ విడత గొర్రెల పంపిణీ పథకం
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

**అచ్చంపేట, జూలై 20 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గొర్రెల పంపిణీ పథకం యాదవులకు అద్భుతమైన కానుక అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. గురువారం మండల పరిధిలోని మన్నెవారిపల్లి గ్రామంలో 2వ విడత గొర్రెల పంపిణీ పథకాన్ని యాదవులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెల ఉత్పత్తిలో రాజస్థాన్ రాష్ట్రాన్ని అధిగమించి తెలంగాణ దేశంలోనే నెంబర్‌వన్ స్థానానికి చేరుకుందని, రెండు విడతలలో తెలంగాణలోని గొల్ల, కురుమలకు గొర్రెలను అందించి వారి వృత్తుల సాధికారతకు దోహద పడుతుందన్నారు. గొల్ల కుర్మలు ఆర్థికంగా బలోపేతం కావడానికి ప్రభుత్వం గొర్రెల పంపిణీ చేపడుతుందన్నారు. మన్నెవారిపల్లి గ్రామంలో 2వ విడతలో 18 యూనిట్లు పంపిణీ పూర్తి చేశామని, ఒక యూనిట్ కోసం రూ.1.75లక్షలు ఖర్చు చేశామన్నారు. త్వరలోనే అచ్చంపేట నియోజకవర్గ వ్యాప్తంగా 2వ విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షులు మనోహర్, పీఏసీఎస్ చైర్మన్ రాజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పర్వతాలు, నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, లోక్యనాయక్, తిరుపతియాదవ్ గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతో శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడాలి:జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

**గద్వాల ప్రతినిధి, జులై 20 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రజల భాగస్వామ్యంతో శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి పోలీస్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లాకు కొత్తగా వచ్చిన డీఎస్పీ వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ అనంతరం జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతిని మర్యాదపూర్వకంగా ఐడిఓసి చాంబర్‌లో పూలబొకే అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

## నారాయణపేట అదనపు కలెక్టర్‌గా పి.అశోక్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

**నారాయణపేట ప్రతినిధి, జులై 20 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా అదనపు కలెక్టర్‌గా (రెవెన్యూ) పి.అశోక్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్‌కు చేరుకుని బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు ఆయన కలెక్టర్ కోయ శ్రీహర్షను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వివిధ శాఖల అధికారులు అదనపు కలెక్టర్‌కు స్వాగతం పలికి పరిచయం చేసుకున్నారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ పి. అశోక్‌కుమార్ ఇక్కడికి చేరుకుని బాధ్యతలు స్వీకరించారు.



# మూడు రోజులుగా ముసురే..!

- ఉమ్మడి పాలమూరులో మోస్తరు వర్షం..
- పలు చోట్ల కూలిన ఇండ్లు
- అప్రమత్తంగా ఉండాలంటూ అధికారుల హెచ్చరికలు
- కలెక్టర్ కార్యాలయాల్లో కంట్రోల్ రూంలు..
- నేడు,రేపు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సెలవు

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 20, ప్రభాతవార్త :** మూడు రోజులుగా ముసురు వాన కురుస్తున్నది. ఎడతెరిపి లేని వర్షాలకు జనజీవనం స్తంభించింది. మరోవైపు మరో నాలుగు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. అల్పపీడన ప్రభావంతో ఏర్పడిన సియర్ సూన్ తుఫాన్ వల్ల తెలంగాణకు వర్షాలు కురుస్తున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. పలు చోట్ల రోడ్లపై నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. జడ్చర్ల మండల కేంద్రంలో నల్లకుంటకు భారీగా వరద నీరు చేరడంతో మున్సిపల్ కమిషనర్ మహెమూద్ షేక్ అక్కడకు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. వరదనీరును కాలువ గుండా వెళ్లేలా చర్యలు తతీసుకున్నారు. కుంట పరిసరప్రాంత ప్రజలు అప్రమత్తండా ఉండాలని సూచించారు. చిన్న పిల్లలను కుంట సమీపంలోకి పంపించొద్దని చెప్పారు. నిరంతరంగా కురుస్తున్న వర్షాలకు మహబూబ్‌నగర్‌లోని వీరన్నపేటలో శ్రీశైలానికి చెందిన పెంకుటిల్లు కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ముసురు వర్షాల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని మహబూబ్‌నగర్ అర్బన్ తాసిల్దార్ పార్థసారధి తెలిపారు. వీరన్నపేట శ్రీశైలం ఇంటిని ఆయన పరిశీలించారు.

**కలెక్టర్, అధికారుల రివ్యూ..**

వర్షాలపై రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు, వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు జిల్లా స్థాయి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు, టెలీకాన్ఫరెన్స్‌లు, అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి అధికారులను అప్రమత్తం చేశారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్ ఆదేశించారు. ఈమరేకు వర్షాల నేపథ్యంలో గురువారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు వర్షాలకు ఇబ్బందులు పడకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షం వల్ల ఇబ్బందులు పడితే కలెక్టరేట్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు.



వీరన్నపేటలో కూలిన ఇల్లు

**వర్షపాతం నమోదు ఇలా..**

ఉమ్మడి పాలమూరులో జిల్లాలో మహబూబ్నగర్ , నారాయణపేటలో మధ్యస్తంగా వర్షపాతం 15మి.మీ.- నుంచి 64మి.మీ నమోదు కాగా నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాలో సాధరణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. నారాయణపేట జిల్లాలో మద్దూరు, కోస్గి, దామరగిద్దలో 30మి.మీ. వర్షపాతం నమోదు అయింది.

**కుండపోత వర్షంలోనూ మంత్రి పర్యటన..**

వరద నీటి నుంచి మహబూబ్‌నగర్ పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసేందుకు ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ స్వయంగా ట్యాంక్ బండ్ వద్దకు చేరుకొని వరద నీటిని పరిశీలించారు. పురపాలక, నీటిపారుదల శాఖ అధికారులను, సిబ్బందిని ట్యాంక్ బండ్ వద్దకు పిలిపించి వర్షపు నీరు లోతట్టు ప్రాంతాలకు వెళ్లకుండా చెరువులోకి మళ్లించేందుకు ఇసుక బస్తాలను అడ్డ వేయించారు. జోరువానలోనూ సుమారు రెండు గంటలు పర్యటించారు. పనులను పర్యవేక్షించారు. బీకే రెడ్డి వైపు వెళ్లే నాలాలో ప్రవాహాన్ని కూడా పరిశీలించారు. మంత్రి వెంట కలెక్టర్ రవినాయక్, ఎస్పీ నరసింహ, అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్ దోత్రే , మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్ ఉన్నారు.



మహబూబ్‌నగర్ ట్యాంక్‌బండ్ వద్ద వరద వరద నీరు కాలనీల్లోకి వెళ్లకుండా సూచనలు చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో కలెక్టర్ రవినాయక్

**నేడు, రేపు విద్యాసంస్థలకు సెలవులు..**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తెలంగాణ సర్కార్ విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించింది. బుధవారం నుంచి ముసురు వర్షం కురుస్తున్నా, వాతావరణ శాఖ రెండు రోజులపాటు వర్షాలు పడతాయని హెచ్చరిస్తున్నా విద్యాశాఖ మంత్రి గురువారం ఉదయం సెలవు ప్రకటించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. తమ పిల్లలను పాఠశాలకు పంపించాకా సెలవు ప్రకటిస్తే మళ్లీ ఇంటికి ఎలా తీసుకురావాలంటూ సోషల్ మీడియా కేంద్రంగా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో విద్యాశాఖ అప్రమత్తమై మరో రెండు రోజులపాటు సెలవులు ప్రకటించింది. శుక్రవారంతోపాటు శనివారం కూడా సెలవు ప్రకటిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు.

## పోడు భూముల విషయంలో సర్కార్ మాటతప్పలే..

- గిరిజనులకు భూమిపై హక్కు..
- ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్
- హన్వాడలో 19మందికి పట్టాలు పంపిణీ

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 20, ప్రభాతవార్త :** పోడు భూములకు పట్టాల పంపిణీతో గిరిజనలకు భూమిపై నాది అనే హక్కు కల్పించామని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. హన్వాడ మండల కేంద్రంలో 19మంది గిరిజనలకు 13.02ఎకరాల పోడు భూములకు మంత్రి పట్టాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పేద దళిత, బడుగు బలహీన వర్గాలకు అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలు మరేఇతర రాష్ట్రాల్లో లేవన్నారు. గిరిజునలకు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్న సమస్యలు ఎవరూ పరిష్కరించలేదని, తెలంగాణ ప్రభుత్వం వారికి పట్టాలు పంపిణీ చేసి హక్కు కల్పించిందన్నారు. దీంతో గిరిజనలకు రైతు బంధుతోపాటు ఇతర పథకాలు సైతం వర్తిస్తాయన్నారు. తెలంగాణ వచ్చాక తండాలను సైతం పంచాయతీలుగా మార్చిందన్నారు. ఇంటింటికీ మిషన్ భగీరథతో తాగునీటిని అందించామని, తండాల్లో సైతం పంచాయతీ భవనాలను నిర్మించామని, ఇతర ప్రాంతాల్లో మాదిరిగా అన్ని పథకాలు అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమంలో భాగంగా హైదరాబాద్‌లో బంజారా భవన్ కట్టించిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి రైతుల పట్ల ఎనలేని ప్రేమ ఉందని, రెండు ఎకరాలు ఉన్న రైతు సైతం రెండు పంటలు పండిస్తున్నాడన్నారు. పాలమూరు -రంగారెడ్డి పథకం పూర్తయితే నియోజవర్గం సస్యశ్యామలం అవుతుందన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో రూ.12కోట్లతో సేవాలాల్ మహరాజ్ దేవాలయంతోపాటు గిరిజన హాస్టల్, గిరిజన భవన్ కట్టించామన్నారు. భవిష్యత్తులో పోడు భూములు పొందిన రైతులకు ఎస్టీ కార్పొరేషన్ ద్వారా బోర్లు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. జిల్లాలో ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్న కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అంతకముందు రూ.10లక్షలతో తాసిల్దార్ కార్యాలయం పై ఫ్లోర్‌లో నిర్మించిన సమావేశ మందిరాన్ని ప్రారంభించారు. అంతేకాగా తాసిల్దార్ కార్యాలయంలో ప్రారంభించిన రక్తదాన శిబిరంలో 66మంది రక్తదానంచేశారు. అనంతరం మంత్రి 8మందికి ఇండ్ల పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కలెక్టర్, ఎంపీపీ బాలరాజు, జిల్లా గిరిజ న సంక్షేమ అధికారి చత్రూనాయక్, జిల్లా అటవీశాఖ అధికారి సత్యనారాయణ, జిల్లా పశుసంవర్ధక అధికారి మధుసూదన్‌గౌడ్, బీసీ సంక్షేమ అధికారి ఇందరి, తాసిల్దార్ బక్క శ్రీనివాస్, ఎంపీడీవో ధనుంజయగౌడ్, రెడ్‌క్రాస్ సొసైటీ లయన్ నటరాజ్ పాల్గొన్నారు.



పోడు పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కలెక్టర్

## వర్షాల కారణంగా జిల్లా పోలీస్ అధికారులతో ఎస్పీ టెలికాన్ఫరెన్స్..!

**గద్వాల ప్రతినిధి, జులై 20 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున జిల్లా ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా పోలీస్ శాఖపరంగా తగిన ఏర్పాట్లతో ముందస్తుగా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ కె. సృజన ఆదేశించారు. జిల్లా ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలు, పోలీస్ అధికారులు, సిబ్బంది తగిన ఏర్పాట్లతో చేపట్టవలసిన చర్యలు గురించి పలు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. అలాగే ప్రజలు కూడా గ్రామాలలో/ పట్టణాలలో పాత ఇండ్లు, గుడిసెలలో, శిథిలావస్థలో ఉన్న నివాసాలలో ఉండే వారు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వర్షాల దృష్ట్యా 24 గంటల పాటు పెట్రో, బ్లూ కోల్ట్స్ సిబ్బందితో గస్తీ నిర్వహిస్తూ ప్రజలను మరింత అప్రమత్తం చేయాలని, వాగుల తీర గ్రామాలలో చెరువు, అలుగుల వద్ద పెద్దలు తమ పిల్లలను వాగులలోకి, అలుగుల వద్దకు వెళ్లకుండా చూడాలని, నీటి ప్రవాహాలు వచ్చే అవకాశం ఉన్నందున ఆయా ప్రాంతాలలో అప్రమత్తంగా ఉండాలని, వర్షాల దృష్ట్యా పోలీసు అధికారులు సిబ్బంది తమ వెంట రోప్స్, టార్చ్‌లైట్లు, ట్యూబ్స్, లైవ్ జాకెట్స్ వెంట ఉంచుకోవాలని ఎలాంటి ప్రమాదం ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఎస్పీ పోలీసు అధికారులకు, సిబ్బందికి సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న చెరువులు, కుంటల అలుగుల దగ్గర, ప్రధాన రహదారులపై ప్రవహించే వాగులు, వంకల దగ్గర నీటి ప్రవాహం గురించి ముందస్తు సమాచారం తెలుసుకుని ప్రత్యక్షంగా వెళ్లి పర్యవేక్షించి పోలీస్ అధికారులు, సిబ్బంది అన్నిజాగ్రత్త చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను, సిబ్బందిని ఎస్పీ ఆదేశించారు. స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ, విద్యుత్, ఆర్‌అండ్‌బి, వైద్యశాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ వర్షాల వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజలను జాగృథం చేయాలని అన్నారు. జిల్లాలో ఎక్కడైనా రోడ్లపై వరద ఉధృతితో రోడ్లు తెగిపోయినా, ఉధృతంగా ప్రవహించినా అక్కడికి ఆ గ్రామ ప్రజలు వెళ్లకుండా, రెండు దిక్కులా ప్లాస్టిక్స్ కోన్స్, బారికేడ్స్, హెచ్చరిక గల ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి సంబంధిత గ్రామాల సర్పంచ్‌లను, ప్రజలను అప్రమత్తం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులతో ఎప్పటికప్పుడు వరద ఉధృతి గురించి అడిగి తెలుసుకుని ప్రమాద నివారణ చర్యలను చేపట్టడానికి సిద్ధంగా ఉండాలని గ్రామ పోలీస్ అధికారులకు సూచించారు. పట్టణాలలో, గ్రామాలలో మట్టితో కట్టిన పురాతన సురక్షిత ప్రాంతాలకు తరలిం చేందుకు సహాయ సహకారాలు అందిం చాలని ఆదేశించారు. నది పరవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఎప్పటికప్పుడు వాగులు వర్షాలలో విద్యుత్ స్థంభాలకు ఎర్తింగ్ ద్వారా విద్యుత్ సరఫరా అయ్యి కరెంటు షాక్ తగిలే అవకాశం ఉందని జిల్లా ప్రజలు, పిల్లలు ఎవరు కూడా విద్యుత్ స్థంభాలను కానీ, విద్యుత్ పరికరాలను ముట్టుకోకుండా వారిని జగృతం చేయాలని, అలాగే విద్యుత్ సరఫరాలో ఏదైనా లోపం ఉంటే వెంటనే సంబంధిత విద్యుత్ అధికారులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. భారీ వర్షాల వల్ల ఏదైనా విపత్కర సమస్య వస్తే లోకల్ పోలీస్ అధికారులకు లేదా డయల్ 100 లేదా జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 87126 70306 నంబర్లకు సమాచారం అందిస్తే తక్షణ సహాయక రక్షణ చర్యలు చేపడతామని జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రజలందరు ఈ వర్షాకాలంలో జాగ్రత్తలు పాటిస్తూ వరదల పట్ల అప్రమత్తంగా ఉంటూ విష వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తగా, ఆరోగ్యంగా ఉండాలని అన్నారు.





జిల్లా ఎస్పీ సృజన

## కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న గద్వాల జడ్పీ ఛైర్‌పర్సన్

**మాజీ మార్కెట్ ఛైర్మన్ బండ్ల లక్ష్మిదేవి చంద్రశేఖర్‌రెడ్డి**

**గద్వాల ప్రతినిధి, జులై 20 ప్రభాతవార్త:** ఢిల్లీలో ఏఐసిసి ప్రెసిడెంట్ మల్లికార్జున ఖర్గేసమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరిన జోగులాంబ గద్వాల జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత దంపతులు, బండ్లచంద్రశేఖర్‌రెడ్డి దంపతులు, సర్పంచ్ ధనలక్ష్మి అమరవాయి కృష్ణారెడ్డిలు కాంగ్రెస్ పార్టీలో చేరారు.



## యాంజియోగ్రామ్ అవసరం లేకుండా పరీక్షలు..

**అధునాతన ఎమ్మారై స్కానింగ్ యంత్రం ప్రారంభించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జులై 20 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎస్‌విఎస్ ఆసుపత్రిలో మొట్ట మొదటిసారిగా ఏర్పాటు చేసిన అధునాతన ఏఐ ఆధారిత 3.0 టెస్లా ఎమ్మారై స్కానింగ్ యంత్రాన్ని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. ఖచ్చితమైన ఫలితాలు వచ్చేలా ఈ అధునాతన స్కానిర్ యంత్రం పని చేస్తుందని ఆయన అన్నారు. హైదరాబాద్ స్థాయి అత్యాధునిక వైద్య సేవలను అందుబాటు ధరల్లో స్థానికంగానే అందిస్తున్నందుకు ఎస్‌విఎస్ ఆసుపత్రి యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. గుండెకు సంబంధించి యాంజియోగ్రామ్ అవసరం లేకుండా ఈ అధునాతన యంత్రంలో ఖచ్చితమైన పరీక్షలు చేయవచ్చన్నారు. ఆర్థోపెడిక్ వైద్యుడిగా రెండు తెలుగు రాష్ట్రాల్లో డా. కేజెరెడ్డి ఎంతో ప్రఖ్యాతిగాంచారని ఆయన మన జిల్లావాసి కావడం గొప్ప విషయమన్నారు. జిల్లా కేంద్రంలో సుమారు రూ. 500 కోట్లతో చేపట్టిన అధునాతన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం పూర్తయిన తర్వాత హైదరాబాద్ స్థాయి వైద్యం స్థానికంగానే అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో డిసిసిబి ఇంచార్జి ఛైర్మన్ వెంకటయ్య, డా. కజెరెడ్డి, వెంకట్‌రెడ్డి, రామ్‌రెడ్డి, కౌన్సిలర్ వనజ తదితరులు పాల్గొన్నారు.



## ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై ఓటర్లకు అవగాహన

**గద్వాల జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి**

**గద్వాల ప్రతినిధి, జులై 20 ప్రభాతవార్త :** జిల్లాలో ఓటుహక్కు వినియోగంపై ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై ఓటర్లకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. గురువారం సాయంత్రం పిజెపి క్యాంపులో గల ఈవిఎం గోడౌన్‌ను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఓపెన్ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెండు నియోజకవర్గాలలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకు కంట్రోల్ యూనిట్లు, బ్యాలట్ యూనిట్లు, వివి ప్యాట్లు తీయడం జరిగిందని, వాటితో ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సందర్భంగా 15 కంట్రోల్ యూనిట్లు, 15 బ్యాలట్ యూనిట్లు, 15 వివి ప్యాడ్స్ గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ రాములు, తహసిల్దార్ గద్వాల వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ వరలక్ష్మి, సురేష్, ఆర్ఐ వెంకటేశ్వర్‌రెడ్డి, బిఆర్‌ఎస్ సుభాన్, కాంగ్రెస్ శివరాజ్, వైఎస్‌ఆర్‌సిపి అచల్, రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.



## అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కుమార్ దీపక్...

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 20 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా నియమితులైన కుమార్ దీపక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. 2019 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన కుమార్ దీపక్‌ను అదనపు కలెక్టర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కలెక్టర పి.ఉదయ్‌కుమార్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన అదనపు కలెక్టర్ కుమార్ దీపక్‌ను వివిధ శాఖల జిల్లా అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా విస్తీర్ణం మండలాలు, జనాభా తదితర అంశాలను, సీపీఓను అడిగి తెలుసుకున్నారు. నర్సరీల నిర్వహణ, హరితహారం కార్యక్రమ అమలు మొక్కల సంరక్షణ తదితర అంశాలపై డీఆర్డీఏ పీడీతో చర్చించారు. పంచాయతీ వివరాలు పచ్చదనం పరిశుభ్రత అంశాలపై డీపీఓతో చర్చించారు. మన ఊరు – మన బడి కార్యక్రమం ద్వారా జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల పనుల వివరాలను డీఈఓను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో స్థానిక సంస్థల ఆధీనంలో కొనసాగుతున్న – మిగతా4లో..



## అనిరుధ్‌రెడ్డి దొర అహంకారాన్ని వీడాలి..

**- జడ్చర్ల స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన గిరిజన నాయకులు**



**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 20, ప్రభాతవార్త :** మూడు రోజులు కిందట బాలానగర్ సభలో గిరిజన బిడ్డ అయిన మహబూబ్‌నగర్ కలెక్టర్ జి రవినాయక్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అనిరుధ్‌రెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని గిరిజన నాయకులు జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ గిరిజనులకు చిన్నిచూపు చూడడం అనిరుధ్‌రెడ్డి దొరఅహంకారానికి నిదర్శనమని వెంటనే గిరిజన జాతికి ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.బ్రిటీష్ జాతిని ఎదురించిన జాతి గిరిజన జాతి అని, అలాంటి గిరిజన తెగకు చెందిన జిల్లా మెజిస్ట్రేట్ ను దూషించడం ఎంతరవకు సమంజసమని , గిరిజన జాతి క్షమించదని చెప్పారు. అనిరుధ్ గిరిజన జాతికి క్షమాపణ చెప్పని యెడల పాద యాత్రను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఫిర్యాదు చేసిన వారిలో లక్ష్మీశంకర్‌నాయక్,కౌన్సిలర్ శంకర్‌నాయక్,మాజీ ఎంపీటీసీ రవినాయక్, జీవీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేష్‌నాయక్, సర్పంచ్ రాములునాయక్, రాజూనాయక్, గోవింద్‌నాయక్ పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులు సరికాదు..



**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 20, ప్రభాతవార్త:** తెలంగాణలో డబుల్ బెడ్రూం ఇండ్ల సాధనకు బీజేపీ పోరుబాట సల్పిందని, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి రంగారెడ్డి జిల్లా బాటసింగారం అన్నమాచార్య కాలేజ్ వద్ద నిర్మాణంలోఉన్న డబుల్ బెడ్రూం ఇండ్లను క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్తున్న సందర్భంగా జడ్చర్ల బీజేపీ శ్రేణులకు ముందస్తుగా అరెస్టులు చేయడం సరైన పద్ధతి కాదని బీజేపీ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా అరెస్టయిన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్,టౌన్‌అధ్యక్షుడు సామలనాగరాజు,కౌన్సిలర్ కుమ్మరిరాజు,టౌన్ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు,బీజేవైఎం టౌన్‌అధ్యక్షుడు పిట్టలనరేష్,కిసాన్ జిల్లాఅధికార ప్ర తినిధి బుక్కా నవీన్‌బాలు, సూరజ్,దోజర్ శివ,శ్రీనాథ్‌ను పూచికత్తుపై విడిచిపెట్టారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీఆర్ఎస్‌ప్రభుత్వం రెండుసార్లు డబుల్ బెడ్రూం ఇండ్ల ఆశ చూయించి అమాయక ప్రజలను మోసం చేస్తూ అధికారంలోకి వచ్చి నేటికీ పేదలకు ఇండ్లు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. అక్రమ అరెస్టులు చేయడమే పోరాడి సాధించుకున్న తెంగాణ ఫలితమా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌కు కనువిప్పు కలిగించేలా పేదలకు న్యాయం జరిగే వరకు బీజేపీ పోరుబాట ఆపదని స్పష్టం చేశారు.

## నిర్బంధ అరెస్టులు మాకు కొత్తేమికాదు..

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. కొండయ్య**



**మక్తల్,జులై 20 ప్రభాతవార్త:** టిఆర్ఎస్ నిరంకుశ పాలనపై ప్రశ్నిస్తున్న నాయకులను నిర్భందించిన మాత్రాన పోరాటం ఆగదని, తమకు అరెస్టులు, నిర్బందాలు కొత్తేమి కాదని కొండయ్య ఘాటుగా విమర్శించారు. బాటసింగారంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించేందుకు వెళ్తున్న బిజెపి నేతలను అడ్డుకుని అరెస్టులు,హౌస్ అరెస్టులు చేయడాన్ని గురువారం బి. కొండయ్య తీవ్రంగా ఖండించారు. అధికార పార్టీకి ఇది ఒక దురలవాటుగా మారిందని ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యంలో నిరసనలు తెలిపే హక్కు ప్రతిపక్షాలకు ఉందన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చే బాధ్యత ప్రతిపక్షాలుగా తమపై ఉందన్నారు. భరాసా ప్రభుత్వం రాజ్యాంగ, ప్రజా వ్యతిరేక చర్యలను ఆపకపోతే త్వరలోనే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కెసిఆర్ నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని ఈ ప్రభుత్వ తాటాకు చప్పుళ్లకు ఎవరూ భయపడమని కెసిఆర్ తన తీరు మార్చుకోవాలని, లేదంటే బిఆర్ఎస్‌ను ప్రజలు మార్చడం ఖాయమని హెచ్చరించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని చెప్పి మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. అరెస్టు చేసిన బిజెపి నాయకులు, కార్యకర్తలందరిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని బి. కొండయ్య డిమాండ్ చేశారు.

## బిజెపి నాయకులకు ముందస్తు అరెస్టు తగదు




**మాగనూరు,జులై 20 ప్రభాతవార్త:** డబుల్ బెడ్‌రూం ఇండ్లపై బిజెపి పోరుబాట పట్టిందని ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేని అసమర్థ కెసిఆర్ కేంద్రం నిధులు దారి మళ్లించిన దగాకోరు సొంతింటి కలను నెరవేరుస్తామని పేదలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. హైదరాబాద్‌లో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మద్దతు తెలియజేయడానికి వెళ్తుండగా మాగనూరులో ముందస్తు అరెస్టు చేయడం హేయమైన చర్యని ప్రభుత్వ నియంత పాలన అంతం చేయడం కోసం ప్రతి కార్యకర్త నడుం బిగించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రాష్ట్ర నాయకత్వం ఇచ్చే పిలుపులో మాగనూరు మండలం నుంచి పెద్ద ఎత్తున పాల్గొంటామని ఇలాంటి పోలీసుల అరెస్టులకు కేసులకు భయపడే ప్రసక్తే లేదని వారన్నారు. కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షుడు జయనందురెడ్డి, మాగనూరు మండల ప్రధాన కార్యదర్శి అశోక్‌గౌడ్, సీనియర్ నాయకులు చంద్రశేఖర్, యువ నాయకులు సుమంత్, కడేచూర్, వి. రవికుమార్, వాకిటి విష్ణు పాల్గొన్నారు.

## పురాతన నాగుల దేవత గుడిని అభివృద్ధి చేయాలి..



**వనపర్తి టౌన్,జులై20,ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని రాజీవ్‌చౌక్‌లో 100 ఏళ్ల పైబడిన చరిత్ర గల పురాతన నాగుల దేవత గుడిని అభివృద్ధి చేయాలని హిందూ వాహిని పట్టణ శాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ అభిలాష్ హౌదేకర్ మాట్లాడుతూ..100 ఏళ్లపైబడిన ఈ గుడిని వనపర్తి సంస్థానాదీశులు రాజ రామేశ్వర్‌రావు ఈ ప్రాంత ప్రజలందరూ సుఖసంతోషాలతో సిరిసంపదలతో ఉండాలని అప్పట్లోనే హోమం,యాగాలతో నాగదేవత విగ్రహాన్ని ప్రతిష్టించడం జరిగిందని,ఇది ఎంతో చరిత్ర గల నాగదేవత గుడికిరోడ్ కటింగ్‌లో భాగంగా ఇబ్బంది కరంగా మారడంవల్ల పట్టణ ప్రజలు ఆవేదనకు గురవుతున్నారన్నారు.నాగదేవత విగ్రహాన్ని పునఃప్రతిష్టించి గుడిని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో హిందూవాహిని జిల్లా కన్వీనర్ అరుణ్, అరవింద్, నరేష్‌గౌడ్, పట్టణ కన్వీనర్ రోహిత్, నంద తదితర హిందూ వాహిని కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ భవనానికి స్థలం అందజేత...



**వెల్దండ, జూలై 20 ప్రభాతవార్త:**వెల్దండ మండలం సిలోనిబావితాండ నూతన గ్రామ పంచాయతీ ఏర్పడటంతో పంచాయతీ భవన నిర్మాణానికి స్థలం అందుబాటులో లేకపోవడంతో గ్రామానికి చెందిన ఆర్.హన్మంతుకు చెందిన 400 చ॥గజముల స్థలాన్ని పంచాయతీ భవనానికి అందజేస్తానని సర్పంచ్ మంగ్యతాక్యనాయక్‌కు పత్రాన్ని అందించారు. పంచాయతీ భవనానికి స్థలం అందజేసిన ఆర్.హన్మంత్‌ను సర్పంచ్‌తో పాటు తాండ వాసులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లచ్చిరాం, సురేష్, మల్లేష్, రమేష్, లక్ష్మిపతి, మోత్య, శ్రీను, చంద్రు, రవితో పాటు తదితరులు ఉన్నారు.

# గిడ్డంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా రజిని బాధ్యతలు..!



శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్



రజినీకి శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల



బొకే అందజేస్తున్న కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, నందకిషోర్‌గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 20, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా రజినిసాయిచంద్ గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈమేరకు ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సమక్షంలో ఆమె హైదరాబద్‌లోని కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు ఆల లక్ష్మారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కశిరెడ్డి నారాయణరెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, సాట్స్ మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి, ఇతర నాయకులు ఆమెకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లా అమరచింతకు చెందిన గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ కొన్ని రోజుల కిందట గుండెపోటుతో తనువు చాలించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఆమెకు అండగా నిలుస్తూ సీఎం కేసీఆర్ ఆమెకు సాయిచంద్ పదవీ కొనసాగించాలని తెలుపడంతో గురువారం ఆమె బాధ్యతలు చేపట్టారు. సాయిచంద్ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ఈ సందర్భంగా మంత్రులు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ మాత్రమే కాదని, తెలంగాణ సమాజమే గొప్ప కళాకారుడికి కోల్పోయిందని, ఆయన లేని ఎవరూ తీర్చలేరని పేర్కొన్నారు. నూతన పదవీ బాధ్యతలు చేపట్టిన రజినీని జడ్చర్ల కౌన్సిలర్లు కోట్ల ప్రశాంత్‌రెడ్డి, నందకిషోర్‌గౌడ్, నాయకుడు బోరవెల్లి సాయిరాం తదితరులు కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వారికి సాయిచంద్‌తో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు.

# కరెంటు కష్టాలకు కారణమే కాంగ్రెస్..!

**ఉచిత విద్యుత్‌పై రేవంత్ వ్యాఖ్యలు విడ్డూరం**

**సీఎం కెసిఆర్ వ్యవసాయాన్ని పండగ చేశారు**

**బిఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి రామలింగం**



మాట్లాడుతున్న రామలింగం

**నారాయణపేట ప్రతినిధి,జులై20 ప్రభాతవార్త:** టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతు వ్యతిరేక వ్యాఖ్యలపై మండిపడ్డారు. తమ అనుభవాలను పంచుకున్నారు. కేవలం 3గంటలపాటు కరెంటు చాలా అనడం అవగాహనా రాహిత్యం అన్నారు. ఒక గంటలో ఒక ఎకర పారడం కూడా సాధ్యం కాదన్నారు. ఈ సందర్భంగా రామలింగం మాట్లాడుతూ గతంలో కరెంటు కష్టాలకు కారణమే కాంగ్రెస్ అన్నారు. వారి అసమర్థ, దుష్ట, దుర్మార్గ పాలన వల్లే రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని, వ్యవసాయాన్ని దండగ చేసిన పాపం ఆ పార్టీదే అన్నారు. ఉచిత విద్యుత్‌పై రేవంత్ వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయన్నారు. కాకపోతే కాంగ్రెస్ వస్తే మాత్రం మళ్లీ ఆ కష్టకాలం రాక తప్పదని ఆ అనుభవాలను భరించలేక ఆ పార్టీకి ప్రజలు చరమగీతం పాడారు. అయినా బుద్ధి రాలేదు. వ్యవసాయానికి కేవలం 3 గంటల కరెంటు చాలట. ఒకగట కరెంటుతో ఒక ఎకరం పారించవచ్చట. వ్యవసాయం గురించి తెలిసినోడు మాట్లాడే మాటలేనా? కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలతో రైతులు నవ్వుకుంటున్నారు. నవ్వుల పాలైన ఆ పార్టీని పాతాళంలో పాతిపెట్టాలి అన్నారు. రైతులకు సాగునీరందక, ప్రాజెక్టులు లేక, భూగర్భ జలాలు అడుగంటి, తాగునీటికి కూడా తల్లడిల్లారు. కరెంటు కష్టాలు, కోతలతో పవర్ హాలీడేలతో తల్లడిల్లినం, సాగునీరు లేక, కరెంటు రాక అంతా ఆగమాగం ఉండేది. రైతులు ఆత్మహత్యలు చేసుకునే దుర్మార్గ పాలన ఆనాడు సాగిందని అందుకే ఆనాడు టిడిపి అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత కొంతకాలం కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే, మళ్లీ అవే పరిస్థితులు దాపురించాయని అన్నారు. త్వరలోనే మన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తయ్యే దశలో ఉందని అన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ నేతాజీరెడ్డి,శివారెడ్డి, జట్లసాగర్ పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు, కిట్‌ల పంపిణీ..




ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన లయన్స్ క్లబ్ సభ్యులు

**మక్తల్,జులై 20 ప్రభాతవార్త:** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 21వ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమం రవి కన్వెన్షన్ హాల్‌లో ప్రోగ్రామ చైర్మన్ లయన్ నాగరాజు, రీజియన్ సెక్రెటరీ, కో చైర్మన్ లయన్ సత్యాంజనేయులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి లయన్స్ క్లబ్ ఇం టర్నేషనల్ వ్యవస్థాపకులు మెల్విన్ జోన్స్ చిత్రపటానికి పూలమాల సమర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లయన్స్ క్లబ్ గత 20 సంవత్సరాల నుండి సమాజానికి , బడుగు, బలహీన వర్గాల వారికి వివిధ రకాల సేవను అందిస్తూ డిస్ట్రిక్ట్ 320లో మంచి గుర్తింపు పొందిందని అన్నారు. పట్టణంలో 30 ఎకరాలలో అన్ని వసతులు గల వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేయడం తన చిరకాల వాంఛని అందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు బి. అంబదాస్ రావు బృందం ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి మెమెంటోతో సత్కరించారు.లయన్ ఎ.రమేష్‌రావు రీజియన్ చైర్‌పర్సన్ నూతన సభ్యులు శరణప్ప, రవికుమార్‌గౌడ్‌లచే ప్రమాణ స్వీకారం చేయించారు.కార్యక్రమంలో గౌరవ అతిథులు సేవారత్న రాష్ట్రపతి అవార్డు గ్రహీత లయన్ ఎ. నటరాజ్ పిడిజి రూ. 50 వేల విలువ గల బ్లాంకెట్లు, సానిటరీ కిట్లను 50 మంది మున్సిపల్ కార్మికులకు అందజేశారు. అంతర్జాతీయ న్యాయవాదుల దినోత్సవం సందర్భంగా న్యాయవాదులైన శ్రీనివాస్, కె. రవికుమార్ గౌడ్‌లను నూతన అధ్యక్షులు సన్మానించారు. కార్యక్రమంలో మక్తల్ భీమా సభ్యులు లయన్ డి. బసవరాజ్, రాజుల ఆశిరెడ్డి, బి. కొండయ్య, కె. శ్రీనివాస్, వై. వీరేశం, కర్నిస్‌స్వామి, వి.నరెందర్, కోళ్ల వెంకటేష్, సుకన్య శేఖర్, కావలి తాయప్ప, పృథ్వీరాజ్, అడ్డం సత్యనారాయణ, ఎ. శ్రీనివాస్, ఎం. రాంచంద్రప్ప,బిక్షపతి, ఎ. అంజిరెడ్డి, బి. రాజశేఖర్‌రెడ్డి, బి. శ్రావణ్‌కుమార్, అరుణ, జయశ్రీ, కె. సుజాత,ఇ. పద్మావతి పాల్గొన్నారు.

# పేదోడి సొంతింటి కల కోసం ఉద్యమిద్దాం..

**- కేసీఆర్ మోసపూరిత వాగ్దానాలను ఎండగడదాం - జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ**



పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నాయకులు

**వనపర్తి టౌన్,జూలై20,ప్రభాతవార్త:**పేదోడి సొంతింటి కల కోసం ఉద్యమిద్దామని, కేసీఆర్ మోసపూరిత వాగ్దానాలను ఎండగడదామని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ పేర్కొన్నారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి పిలుపు మేరకు ఇబ్రహీంపట్నం నియోకవర్గం బాట సింగారం గ్రామంలో అసంపూర్తిగా ఉన్న రెండు పడకల గదుల ఇండ్ల పరిశీలన కార్యక్రమానికి వెళ్తున్న బీజేపీ నాయకులు పోలీసులు ముందస్తు అరెస్టు చేయడం రాజ్యాంగ విరుద్ధమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ... కేసీఆర్ మోసపూరిత హామీలను ప్రజల్లోకి భారతీయ జనతా పార్టీ తీసుకువెళ్లి ఎండగడుతుందని, ఎన్ని అక్రమ అరెస్టులు చేసిన సీఎం కేసీఆర్ మోసపూరిత హామీలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ఎండగడతామని ఆయన పేర్కొన్నారు.జిల్లా ప్రధాన కార్యదర్శి దుప్పల్లి నారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి సూగూరు రాములు, పట్టణ ప్రధాన కార్యదర్శి మామిళ్లపల్లి రాయన్న సాగర్, వనపర్తి పట్టణ యువమోర్చా సోషల్ మీడియా కన్వీనర్ శివకుమార్ నాయుడు లను గురువారం ఉదయం ముందస్తు అరెస్టు చేశారు.

# రైతులకు 24 గంటలు విద్యుత్ అందించడం కాంగ్రెస్ పార్టీకి ఇష్టంలేదు

**మండల జడ్పీటిసి సభ్యుడు విజయభాస్కర్‌రెడ్డి**



మాట్లాడుతున్న మండల జడ్పీటిసి సభ్యుడు విజయభాస్కర్‌రెడ్డి

**కోయిల్‌కొండ,జులై 20 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఉచితంగా 24 గంటల విద్యుత్‌ను అందించడం కాంగ్రెస్ పార్టీకి ఇష్టం లేదని దీంతో రైతులను మభ్యపెట్టే ప్రకటనలు కాంగ్రెస్ పార్టీ వారు చేయడం విడ్డూరంగా ఉందని మండల జడ్పీటిసి సభ్యుడు విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చంద్రాస్‌పల్లి రైతు వేదిక దగ్గర బిఆర్ఎస్ పార్టీ చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తూ రైతుల కోసం కెసిఆర్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ఆదుకోవడం జరిగిందన్నారు. రైతుబంధు, రైతుభీమా పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెట్టిన పథకాల దేశంలో మరెక్కడా అమల్లో లేవన్నారు. మూడు గంటల కరెంటు ఇచ్చే కాంగ్రెస్ పార్టీ కావాలో, 24 గంటలు ఉచిత విద్యుత్ అందించే టిఆర్ఎస్ పార్టీ కావాలో ప్రజలే ఆలోచించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దేశానికి అన్నంపెట్టే రైతన్నకు టిఆర్ఎస్ పార్టీ, సీఎం కెసిఆర్ ఎల్లప్పుడూ అండగా ఉంటారన్నారు. కార్యక్రమంలో మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, కోయిల్‌కొండ గ్రామ సర్పంచ్ బి. కృష్ణ, మండల రైతు సమన్వయకర్త మల్లయ్య యాదవ్, జిల్లారైతు కమిటి సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మోదీపూర్ గ్రామ సర్పంచ్ రవి, మండల టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు భీంరెడ్డి, గ్రామ సర్పంచ్ గోపాల్, లింగుపల్లి సర్పంచ్ సైబప్ప, రైతు కో ఆర్డినేటర్ తిరుమలంపల్లి సుదర్శన్‌రెడ్డి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం వృథా..

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 20, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ఆకస్మికంగా సెలవు ప్రకటించడంతో మధ్యాహ్న భోజనం వృథా అయిందని నిర్వహకులు వాపోయారు. ప్రభుత్వం అక్షయపాత్ర ఫౌండేషన్ సహకారంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నది. ఇందలో భాగంగా తమహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో కోడూరు, నవాబుపేట, బాలానగర్‌లో కిచన్ షెడ్లలో దాదాపు 40వేల మంది విద్యార్థులకు భోజనాన్ని తయారు చేస్తారు. అయితే గురువారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి వర్షం కారణంగా గురు, శుక్రవారం పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. అయితే బుధవారం రాత్రి అయినా లేదా గురువారం ఉదయాన్నే అయినా సెలవు అంశాన్ని తెలిపి ఉంటే భోజనం తయారు చేసే వాళ్లం కాదని నిర్వాహకులు చెబుతున్నారు.దీంతో భోజనంఅంతా వృథా అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమేరకు ప్రభుత్వ హాస్టళ్లకు పంపించి నట్లు తెలిపారు.

## రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్

**రజిని సాయిచంద్‌కు శుభాకాంక్షలు తెలిపిన ప్రజా ప్రతినిధులు**



**గద్వాల ప్రతినిధి,జులై 20 ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్యాలయంలో పదవి ప్రమాణ స్వీకారం చేసిన శుభ సందర్భంగా వారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా,బొకేలతో శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో బిఆర్ఎస్‌వి జోగులాంబ గద్వాల జిల్లా కో ఆర్డినేటర్ ప్రేమలత కురువ పల్లయ్య,మదనాపురం మార్కెట్ యార్డు చైర్మన్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

## కోయిల్‌సాగర్‌లో పెరుగుతున్న నీటిమట్టం

**దేవరకద్ర,జులై 20 ప్రభాతవార్త:** జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్టు కోయిల్‌సాగర్‌లో రోజురోజుకు నీటిమట్టం పెరుగుతుంది. తీలేర్ పంప్ హౌజ్ నుండి 1 మోటర్ ద్వారా బుధవారం కృష్ణ జలాలను కోయిల్‌సాగర్‌కు తరలించారు.దీంతో కోయిల్‌సాగర్ వైపు కృష్ణమ్మ పరుగులు పెడుతుంది.గురువారం సాయంత్రం నాటికి ప్రాజెక్టులో నీటిమట్టం 15.6 ఫీట్లకు చేరింది. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ స్థోమత 32.5 ఫీట్లు. ఇంకా 16.9 ఫీట్ల మేర నీరు వచ్చి చేరితే ప్రాజెక్టు షెటర్లను తెరుస్తారు. ప్రాజెక్టులోకి కొత్త నీరు వచ్చి చేరుతుండటంలో కోయిల్‌సాగర్‌కు జలకళ వస్తుంది. ప్రాజెక్టును చూడటానికి వచ్చే పర్యాటకుల సంఖ్య కూడ క్రమేపి పెరుతుంది.

## మిరప సాగులో మెళకువలు



**ధరూర్,జులై20 ప్రభాతవార్త:**మల్దకల్ మండలంలోని విఠలాపురం రైతువేదికలో ప్రముఖశాస్త్రవేత్త,సంహిత క్రాప్‌కేర్ సీఈఓ గున్నం శ్యాంసుందర్‌రెడ్డిచే మిరపపంట యాజమానయం చీడపీడల నివారణ గురించి అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు. కార్యక్రమంలో రైతు పొలంలో అమర్చుకోదగిన వాతావరణ పరిశీలన కేంద్రం(మిని వెదర్ స్టేషన్), ఏరియల్ డ్రోన్ సర్వే గురించి వివరించడం జరిగింది.ఈఅవగాహన సదస్సులో గ్రామసర్పంచ్ కె. పురుషోత్తంరెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి ఎం.భాస్కర్,రైతు సోదరులు పాల్గొన్నారు.

## పాఠశాల ఆవరణలో కడ్డీలను తొలగించిన రెవెన్యూ అధికారులు

**వెల్దండ,జూలై 20 ప్రభాతవార్త:**మండల పరిధిలోని తుంకిబండతాండ పాఠశాల ఆవరణలో బుధవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు మధ్యలో సిమెంట్ కడ్డీలను పాతారని ఎంఈఓ శంకర్‌నాయక్, క్లస్టర్ హెచ్‌ఎం రాజశేఖర్,ప్రధానోపాధ్యాయులు కవితలు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.స్పందించిన తహసీల్దార్ సంఘటనస్థలానికి ఆర్ శంకర్, పోలీస్ సిబ్బందిని పంపించి పాతిన సిమెంట్ కడ్డీలను తొలగించారు. ఇటువంటివాటికి పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

## నేడు మానాజీపేటకు మంత్రి నిరంజన్‌రెడ్డి రాక

**జల్లాఘణపురం,జూలై20,ప్రభాతవార్త:** జల్లాఘణపురం మండల పరిధిలోని మానాజీపేటలో విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పాల్గొంటారని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య గురువారం తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో అన్నారు. మాట్లాడుతూ... ఈకార్యక్రమానికి మండలస్థాయి ముఖ్య నాయకులు ఎంపీపీ,జడ్పీటీసీ,రాష్ట్ర ఆయిల్‌ఫామ్ అభివృద్ధి సంస్థ డైరెక్టర్, పీఏసీఎస్ చైర్మన్ మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు , వనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, రాష్ట్ర సహకార సంఘం డైరెక్టర్, మండల వైస్ ఎంపీపీ, పీఏసీఎస్ వైస్ చైర్మన్, జిల్లా రైతు సంఘం డైరెక్టర్, జిల్లాగొర్రెలకాపరుల సంఘండైరెక్టర్, జిల్లా శిక్షణ తరగతుల సభ్యులు, అన్ని గ్రామాలసర్పంచులు,ఎంపీటీసీలు,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, పీఏసీఎస్ డైరెక్టర్లు, బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు అన్ని గ్రామాలపార్టీ అధ్యక్ష కార్యదర్శులు,అధ్యక్షులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## చైర్మన్ పదవీ స్వీకారోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే ఆల



**భూత్పూర్,జులై 20 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా స్వర్గీయ వేద సాయిచంద్ సతీమణి వేద రజిని గురువారం పదవి స్వీకారోత్స వ కార్యక్రమానికి దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు హోంమంత్రి మహిమూద్‌అలీ, మంత్రులు హరీష్‌రావు, నిరంజన్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, బిసి కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ మాజీ చైర్మన్ అల్లీపూర్ వెంకటేశ్వర్‌రెడ్డి హాజరై ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

## రైతుభీమాకు దరఖాస్తుల స్వీకరణ..

**ఉప్పునుంతల,జులై 20 ప్రభాతవార్త:** మండలంలోని వెల్టూరు క్లస్టర్ పరిధిలోని గ్రామాలకు చెందిన 399 మంది భీమా చేసుకోవలసి ఉందని మండల విస్తీర్ణాధికారి మంతి భరత్‌కుమార్ తెలిపారు. వెల్టూరు గ్రామంలో 209 మంది రైతులకు గాను 30 మంది రైతులు మాత్రమే రైతుభీమాకు దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. అదేవిధంగా కొరటికల్లులో 140 మంది రైతులకు గాను 9 మంది రైతులు మాత్రమే దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. తిప్పాపూర్ గ్రామంలో 25 మంది రైతులకు గాను కేవలం 6 మంది రైతులు, విఘ్నేష్‌పూర్‌లో 25మంది రైతులకుగాను 5 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారని, వెల్టూరు క్లస్టర్ పరిధిలో 349 మంది రైతులు ఆగస్టు 5 వరకు రైతుభీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే రైతులు పట్టా పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డు, రైతుభీమా, దరఖాస్తు ఫామ్ పూర్తిచేసి కొరటికల్లు రైతు వేదికలో అందజేయాలని సూచించారు.

## వర్షాకాలంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి..

**-టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి కొండ ప్రశాంత్‌రెడ్డి**



**దేవరకద్ర,జులై 20 ప్రభాతవార్త:** వర్షాకాలంలో మండల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి కొండ ప్రశాంత్‌రెడ్డి అన్నారు.దేవరకద్రలో ఆయన గురువారం మాట్లాడారు.వైరల్ ఫీవర్ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.ఇంటి పరిసరాలలో డ్రైనేజిలలో వాటర్ నిల్వకుండా చూసుకోవాలన్నారు.చల్లదనం బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.కాచి వడబోసిన నీటిని తాగాలన్నారు.ఆరోగ్యంలో మార్పులు కనిపిస్తే వెంటనే వైద్యుడ్ని సంప్రదించాలన్నారు.వర్షంలో బయటికి వెళ్ళాల్సి వస్తే గొడుగు,రేయిన్ కోట్‌ను తప్పకుండ వాడాలన్నారు.ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.చిన్నారులకు పండ్లు,పౌష్టికాహారాన్ని ఎక్కువగా తినిపించాలని కొండ ప్రశాంత్‌రెడ్డి సూచించారు.

## బీజేపీ నాయకుల అరెస్ట్..

**వెల్దండ, జూలై 20 ప్రభాతవార్త:**ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించడంతో బీజేపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రంగారెడ్డి జిల్లా బాటసింగారం అన్నమాచార్య కళాశాల వద్ద నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూంలోను క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు విచ్చేస్తున్న తరుణంలో నియోజకవర్గం నుంచి బీజేపీ నాయకులు తరలివెళ్తారనే ముందస్తు సమాచారం మేరకు బీజేపీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా గ్రామాల్లో పేద ప్రజలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇస్తామని హామీలు ఇచ్చి నేటి వరకు గ్రామాల్లో ఒక్క డబుల్‌బెడ్‌రూం ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. అరెస్ట్ అయిన వారిలో గుద్దటి రామస్వామి, ఎంపీటీసీ చక్రవర్తిగౌడ్, రంగరాతి శ్రీశైలం, యాదయ్య, శ్రీనివాస్‌గౌడ్, రాజు, శివ తదితరులు ఉన్నారు. అనంతరం అరెస్ట్ చేసిన బీజేపీ నాయకులను సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.



## బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో ప్రవేశాలకు ధరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు నేడు లక్కీ డ్రీప్ ద్వారా ఎంపిక

**జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాంలాల్**



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 20 ప్రభాతవార్త:**జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల నుంచి బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో 2023-24 సంవత్సరానికి గాను 1 నుంచి 5వ తరగతులలో ప్రవేశాలకు ధరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు శుక్రవారం నాగర్‌కర్నూల్ నూతన కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు లక్కీ డ్రిప్ ద్వారా ఎంపిక చేయనున్నట్లు నాగర్‌కర్నూల్ జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రాంలాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 1వ తరగతిలో 88 సీట్లకు గాను 214 ధరఖాస్తులు, 5వ తరగతిలో 90 సీట్లకు గాను 419 ధరఖాస్తులు వచ్చాయని, లాటరీ పద్దతిన డ్రా తీసి విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను శుక్రవారం ప్రకటిస్తారని, ఆసక్తి కలిగి ప్రవేశాలకు నమోదు చేసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు నిర్ణీత సమయంలోగా హాజరు కావాలని ఆయన తెలిపారు.

## మండల కేంద్రానికి ఓపెన్ స్కూల్ సెంటర్ మంజూరు..

**- కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి**



**వీపనగండ్ల, జూలై 20, ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ సెంటర్ మంజూరు అయినట్లు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఓపెన్ టెన్త్ చదవాలనుకునే వారు 14 సం.ల వయసు పైబడిన వారు ఓపెన్ టెన్త్‌కు అప్లయ్ చేసుకోవచ్చని, అదే విధంగా ఓపెన్ ఇంటర్మీడియట్ కు 15 సం.లు పైబడిన వారు అడ్మిషన్స్ తీసుకోవచ్చని తెలిపారు. అడ్మిషన్‌లు తీసుకోవాలనుకునే వారు పుట్టిన తేదీ సర్టిఫికెట్ కులం సర్టిఫికెట్, ఆదాయం సర్టిఫికెట్ ఇంతకుముందు ఎక్కడైనా చదివి ఉంటే బోనఫైడ్ సర్టిఫికెట్స్‌తో అడ్మిషన్స్ పొందవచ్చని వారు తెలిపారు.ఈ అడ్మిషన్స్ పొందడానికి 14, 15 సం.ల పైబడిన వారు అర్హులని ఆయన తెలిపారు. ఓపెన్ స్కూల్ అడ్మిషన్స్ పొందడానికి చివరి తేదీ ఆగస్టు 14వ తేదీ అని తెలిపారు.

## కేజీబీవీ ఉపాధ్యాయుల, సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి



**వనపర్తి టౌన్,జూలై20,ప్రభాతవార్త:** కేజీబీవీ ఉపాధ్యాయుల, సిబ్బంది దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవిప్రసాద్‌గౌడ్, కృష్ణయ్యలు డిమాండ్ చేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ...వనపర్తిజిల్లా నుండి ఛలో ఎస్‌పిడీ ముట్టడి కార్యక్రమానికి భారీగా తరలివెళ్లడం జరిగిందన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, మినిమం బేసిక్ పే అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. వర్షానికి సైతం లెక్క చేయకుండా హైదరాబాద్‌లోని ఎస్పీడీ కార్యాలయం ఎదుట గొడుగులతో పెద్ద ఎత్తున నినదించారు. వనపర్తి జిల్లా నుండి పెద్ద ఎత్తున కేజీబీవీ సిబ్బంది, యుటీఎఫ్ నాయకులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి హమీద్, తిమ్మప్ప, హన్మంత్, రాధ, సరిత, శ్రీలత, వెంకటమ్మ, చైతన్య, కౌసర్, తేజశ్వని పాల్గొన్నారు.

## కోటి లింగేశ్వర దేవాలయానికి విరాళాల సేకరణ



**వనపర్తి టౌన్,జూలై20,ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయపల్లి సమీపంలోని శ్రీ కోటిలింగేశ్వర స్వామి దేవస్థానంలో నూతనంగా ఏర్పాటు చేసే ధ్యాన కేంద్రం, పంచలోహ శివ లింగం ఏర్పాటుకై విరాళాలను సేకరిస్తున్నట్లు ఆలయ ప్రధాన కార్యదర్శి శేఖర్ తెలిపారు. కార్తీకమాసంలో తలపెట్టిన కోటిలింగాల ప్రతిష్టలో భాగంగా కొత్తకోటకు చెందిన చవ్వ శ్రీనివాసులు ధర్మపత్ని చవ్వ సుజాత , కుమారులు సంతోష్, గౌతమి,మనుమరాలు అక్షరలు తమ వంతుగా రూ.27,116లు విరాళం అందజేయడం జరిగిందని ఆలయ ప్రధాన కార్యదర్శి తెలిపారు. విరాళం అందజేసిన వారికి పార్వతి పరమేశ్వరులు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని ఆయన కోరారు.

# ఈవీఎం ద్వారా ఓటు వేసే విధానంపై ప్రజలు అవగాహన చేసుకోవాలి..

**- జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**

**- ఈవీఎం, వీవీప్యాట్‌ల పనితీరు, అవగాహన కోసం**

**మొబైల్ వాహనాలను ప్రారంభించిన కలెక్టర్**





ఈవీఎం, వీవీప్యాట్‌ల పనితీరు, అవగాహన కోసం మొబైల్ వాహనాలను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**వనపర్తి టౌన్,జూలై20,ప్రభాతవార్త:** ఈవీఎం, వీవీ ప్యాట్‌ల ద్వారా ఓటు వేయడంపై ప్రజలకు మొబైల్ వాహనాల ద్వారా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ ఆవరణంలో ఈవీఎం, వీవీప్యాట్‌లు , అవగాహన పోస్టర్లతో కూడిన రెండు మొబైల్ వాహనాలను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. నేటి నుండి వనపర్తి జిల్లాలో సెప్టెంబర్ 15వ తేదీ వరకు ఊరూరు తిరుగుతూ ప్రజలతో నమూనా ఓటు వేయిస్తు ఈవీఎం ద్వారా ఓటు ఏవిధంగా వేయాలి, దాని పనితీరు, ఈవీఎంపై ఉన్న అపోహలు దూరం చేసే విధంగా అవగాహన కల్పిస్తుందన్నారు. అందులో నియమించబడిన సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకుంటూ ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రజలకు ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించి వారి సందేహాలను నివృత్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రతిరోజు ఎంతమంది ఓటింగ్‌లో పాల్గొన్నారు..? వారి వివరాలతో పాటు రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. నియోజకవర్గంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ప్రతి ఓటరు హెచ్‌టీటీపీఎస్://డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఎన్‌వీఎస్‌పీ.ఇన్ పోర్టల్‌లో తమ ఎపిక్ నంబర్ లేదా పూర్తి వివరాలు నమోదు చేసి తన ఓటు వివరాలను పరిశీలించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సూపరింటెండెంట్ రమేష్ రెడ్డి, పోలీస్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల వేతనాలు పెంచి క్రమబద్దీకరించాలి..

**- ఎంపీడీవో కార్యాలయం ఎదుట సమ్మె నిర్వహించిన గ్రామ పంచాయతీ కార్మికులు**

**- సీఐటీయు రాష్ట్ర కమిటీ సభ్యులు పుట్ట ఆంజనేయులు**



సమ్మె నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

**వనపర్తి టౌన్,జూలై20,ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచి క్రమబద్దీకరించాలని గత 15 రోజులుగా గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తున్న ఉలుకు పలుకు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని సీఐటీయు రాష్ట్ర కమిటీ సభ్యులు పుట్ట ఆంజనేయులు అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిర్వహించిన సమ్మెలో సీఐటీయు రాష్ట్ర కమిటీ సభ్యులు పుట్ట ఆంజనేయులు, సీపీఎం పట్టణ కార్యదర్శి కురుమయ్య లు మాట్లాడుతూ... ఈనెల 21న ఉదయం 11 గంటలకు ఆర్‌డీవో కార్యాలయం నుండి ర్యాలీగా వెళ్లి, జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించాలని, 14 మండలాల నుండి గ్రామ పంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని జిల్లా జేఏసీ పిలుపునివ్వడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఉన్న 50వేల మంది పంచాయతీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ చట్టాలను వర్తింపజేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న కనీస వేతనాల చట్టం అమలు కాక, సెల్యూట్ సన్మానాలతో సరిపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమ సమయంలో కేసీఆర్ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ సిస్టం రద్దు చేసి అందరినీ రెగ్యులరైజ్ చేస్తానని చెప్పి ఇచ్చినమాట తప్పాడని వారు గుర్తు చేశారు. సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని 2016 అక్టోబర్ 26నతీర్పు ఇచ్చిన రాష్ట్రంలో అమలుచేయడం లేదని, సఫాయి కార్మికులు సిపాయిల్లా ఉద్యమిస్తే తప్పా సమస్యలు పరిష్కారం కావని అన్నారు.నేడు జిల్లాకలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మద్దిలేటి,హన్మంత్,మోహన్,సతీష్,స్వామి,చంద్రయ్య, శ్రీను,రామ్‌చంద్రయ్య, నరసమ్మ,తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల అరెస్టులకు భయపడం..

**- బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వ రాజు**



అమరచింత పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

**అమరచింత,జూలై20,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రశ్నిస్తే పోలీసులచే కేసులు అరెస్టులు చేయడం ఏమిటనీ ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని పిలుపులో భాగంగా గురువారం అమరచింతలో బీజేపీ నాయకులను, కార్యకర్తలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వ రాజు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా పోలీసులు ప్రభుత్వం కుమ్మక్కై బీజేపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టడం అన్యామని ఆయన అన్నారు. రాష్ట్రంలో ఇండ్లు లేని పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని హామీ ఇచ్చిన ఇప్పటి వరకు పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వడం లేదని ఆయన అన్నారు. పేదల పక్షాన పోరాడుతున్న బీజేపీ పార్టీని అణగదొక్కాలని ఉద్దేశ్యంతోనే అక్రమ అరెస్టులు చేయిస్తుందని ప్రభుత్వం బీజేపీ నాయకులపై, కేసులు పెట్టి జైలుకు పంపిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు భయపడరని ఆయన అన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతుందని,భవిష్యత్తులో కుటుంబపాలనకు తెలంగాణ ప్రజలు బుద్దిచెప్తారని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలని నిరుద్యోగ భృతి ఇవ్వాలని పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని, ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో బీజేపీ నాయకులు రాకేష్ శెట్టి,శ్రీనివాస్‌యాదవ్,రామకృష్ణ ఉన్నారు.

## చెట్టుకు ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య..

**కల్వకుర్తిరూరల్, జూలై 20 ప్రభాతవార్త:**కల్వకుర్తి పట్టణంలోని మహబూబ్‌నగర్ రోడ్డులో ఉన్న బీసీ గురుకుల పాఠశాల ప్రక్కన గల మిర్యాల శ్రీనివాస్‌రెడ్డికి చెందిన వ్యవసాయ పొలంలో గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఊరి వేసుకొని మృతి చెందిన సం ఘటన చోటు చేసుకుంది. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు సుమారుగా 45నుంచి 50సం॥ల లోపు ఉంటుందని,ఎత్తు 5.4 ఫీట్లు,చామన్‌ఛాయ కలర్‌లో ఉన్నారని, సమాచారం కల్వకుర్తి పీఎస్‌లో సంప్రదించాలన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఆర్థిక సహాయం..



**కల్వకుర్తి, జూలై 20 ప్రభాతవార్త:**కల్వకుర్తి మున్సిపాలిటి పరిధిలోని 7వ వార్డుకు చెందిన పోలే బాల్ లక్ష్మయ్య పెరాలసిస్‌తో బాధపడుతున్న విషయాన్ని కాలనీ వాసుల ద్వారా విషయం తెలుసుకున్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి స్పందించి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. గురువారం కాలనీ వాసులు బాధితుడికి ఆర్థిక సహాయం అందించి ఫౌండేషన్ తరుపున అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు.కార్యక్రమంలో కాలనీవాసులు ఝాన్సీ, నవ్యశ్రీ, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

## అక్రమ అరెస్టలతో ప్రశ్నించే గొంతుకలను, ఉద్యమాన్ని ఆపలేరు...

**కల్వకుర్తి, జూలై 20 ప్రభాతవార్త:**అక్రమ అరెస్టలతో ప్రశ్నించే గొంతుకలను, ఉద్యమాన్ని ఆపలేరని కల్వకుర్తి బీజేపీ నాయకులు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి పేద ప్రజలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇస్తామని మోసపూరిత హామీలు గుప్పించి రెండుసార్లు అధికారంలోకి వచ్చిందని వారు దుయ్యబట్టారు. తెలంగాణలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల సాధనకై బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన పోరుబాటలో భాగంగా కిషన్‌రెడ్డి ఇచ్చిన పిలుపులో భాగంగా బీజేపీ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించడం సిగ్గుచేటుకరమన్నారు. అక్రమ అరెస్టలు చేస్తే అంతకు మించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. అరెస్ట్ అయిన బీజేపీ నాయకులను సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

## అధ్యాపకులను విధుల్లోకి తీసుకోవాలని తహసీల్దార్‌కు వినతి



**కల్వకుర్తి, జూలై 20 ప్రభాతవార్త:**తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 405 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత పది సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న 1654 మంది గెస్ట్ లెక్చరర్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. మా అధ్యాపకులు మాకు కావాలం టూ, అధ్యాపకులను వెంటనే విధుల్లోకి తీసుకొని విద్యాబో ధన జరిగేలా చూడాలని తహసీల్దార్ రాంరెడ్డికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో విద్యార్థులు జగదీష్, నరేష్, శంకర్, చంద్రశేఖర్, అశోక్, యూసుఫ్, లక్ష్మి, నారాయణ, ఆరాధ్య, దీప్తి, ప్రవళిక, అమూల్యతో పాటు సుమారు 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## హెడ్ కానిస్టేబుల్ వెంకోజీని సన్మానించిన భారాస నేతలు, కార్యకర్తలు



**ఉప్పునుంతల,జులై 20 ప్రభాతవార్త:** ఉప్పునుంతల పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ వెంకోజీకి ఉత్తమ సేవాపతకం 2023 రావడంతో గురువారం బారాస నేతలు, కార్యకర్తలు పోలీసు స్టేషన్ ఆవరణలో ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించారు. మరెన్నో అవార్డులు పొందాలని ఆశాభావం వ్యక్తం చేశారు. సన్మానించిన వారిలో అచ్చంపేట పాలశీతలీకరణ చైర్మన్ కట్ట గోపాల్‌రెడ్డి, బిఆర్ఎస్ గ్రామ కమిటి అధ్యక్షుడు మెడమోని శ్రీనివాసులు, సిహెచ్‌సుధాకర్, ఎల్లయ్యయాదవ్, బింగి పర్వతాలు, మల్లయ్య, కుమ్మరి మల్లయ్య, లింగస్వామి తదితరులు ఉన్నారు.

## కొత్త సిఐకి ఘన సన్మానం



**భూత్పూర్,జులై 20 ప్రభాతవార్త:** భూత్పూర్ పోలీస్ స్టేషన్‌కు నూతన సిఐగా ఇక్కడికి బదిలీపై వచ్చిన రామకృష్ణను భూత్పూర్ పీఎస్‌లో సిఐ కార్యాలయంలో బిఆర్ఎస్ సీనియర్ నేత టి.మురళీధర్‌గౌడ్ గురువారం ఘనంగా సన్మానించారు.

## భారీ వర్షాలతో జరభద్రం..!!

**భూత్పూర్ మున్సిపల్ కమిషనర్**

**భూత్పూర్,జులై 20 ప్రభాతవార్త:** అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో గడిచిన వారం రోజులుగా కురుస్తున్న భారీ, అతిభారీ వర్షాలతో భూత్పూర్ ప్రజలు జర ఫైలంగా ఉండాలని భూత్పూర్ మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. రాబోయే మూడ్రోజులు మరీ అప్రమత్తంగా ఉండాలని కోరారు. రాష్ట్రంలో భారీ, అతిభారీ, కుంభవృష్టితో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో వర్షాలతో అప్రమత్తం అవసరమని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాలలో నివసించే ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, పాతమిద్దెలు, పాత ఇళ్లల్లో ఉండకూడదని సూచించారు. అత్యవసరమైతే తప్పా సాధ్యమైనంత వరకు బయటకు వెళ్లకుండా ఉంటే మంచిదని తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధులు,సర్పంచ్‌లు ప్రజల్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని కోరారు.

## లిఫ్టల రిపేర్లకు నిధుల మంజూరుకు ఈఎన్సీకి ఎమ్మెల్యే ఆల వినతి..



**భూత్పూర్,జులై 20 ప్రభాతవార్త:** భూత్పూర్ మండలం కరివెన గ్రామం వద్ద నిర్మాణంలో ఉన్న పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కురుమూర్తిరాయ ప్రాజెక్టు లిఫ్ట్‌ల రిపేర్లకు కోటి 60 లక్షల నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఈఎన్సీ మురళీధర్‌రావును కోరుతూ దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గురువారం ఈఎన్సీ మురళీదర్‌రావుకు వినతి పత్రం సమర్పించారు.

## నూతన ఎస్సైగా సిహెచ్ శ్రీకాంత్



**గద్వాల ప్రతినిధి,జులై 20 ప్రభాతవార్త:** బదిలీలో భాగంగా గద్వాల పట్టణ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఎస్సై సిహెచ్ శ్రీకాంత్ జిల్లా ఎస్పీ కె. సృజనను మర్యాదపూర్వకంగా కలిసి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ వారికి అభినందనలు తెలియజేస్తూ ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా పోలీస్ శాఖపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని మరింత పెంచే విధంగా కృషి చేయాలని,బాధితుల నుండి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి బాధితులకు చట్ట ప్రకారం న్యాయం జరిగేలా చూడాలని, సమాజానికి మంచి సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు.

## ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం

**వెల్దండ, జూలై 20 ప్రభాతవార్త:**మండలంలోని అజిలాపూర్ గ్రామానికి కాలే జంగయ్య, పల్స రామస్వామి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. మృతుల కుటుంబాలకు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సమకూర్చిన రూ.5వేల చొప్పున రూ.10 వేల ఆర్థికసహాయాన్ని ఫౌండేషన్ సభ్యులు పరామర్శించి అందించారు. కార్యక్రమంలో నాయకులు సత్తయ్య, లక్ష్మయ్య, మల్లయ్య, జంగయ్య, లాలు, జయరాం, నర్సింగ్, రాజు, వెంకటయ్య, రమేష్ తదితరులు ఉన్నారు.

## జిల్లా మత్స్యశాఖ వారి హెచ్చరిక



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి,జులై 20 ప్రభాతవార్త:** జిల్లాలో విస్తారకంగా కురుస్తున్న వర్షాల కారణంగా జిల్లాలోని మత్స్యకారులు ఎవ్వరు కూడా నీటి వనరుల లో చేపట వెళ్లి ప్రమాదానికి గురి కావద్దని జిల్లా మత్స్యశాఖ అధికారి డాక్టర్ లక్ష్మప్ప గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నీటి వనరుల ప్రాంతాల్లో చేపల వేటకు వెళ్లి ప్రమాదానికి గురి కావద్దని, వర్షాలు తగ్గేవరకు చేపల వేటకు వెళ్లవద్దని ఆయన సూచించారు.

## రేషన్ షాపులకు బియ్యం తరుగు...

**- లబోదిబోమంటున్న రేషన్ డీలర్లు**

**వెల్దండ, జూలై 20 ప్రభాతవార్త:**పేద వారికి అందించే రేషన్ బియ్యంలో డీలర్లకు తరుగు రావడంతో లబోదిబోమంటున్నారు మండల రేషన్ డీలర్లు. మండల పరిధిలోని కొట్ర, అజిలాపూర్ గ్రామాల్లోని రేషన్ డీలర్లకు ఎమ్ఎస్ఎల్ పాయింట్లలో డీలర్ల వేలి ముద్రలు తీసుకొని పంపాల్సిన బియ్యం కంటే తక్కువగా తన ఇష్టానుసారంగా పంపిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని డీలర్లు వాపోయారు. డీలర్లకు తక్కువగా బియ్యం వస్తే లబ్దిదారులకు ఏ విధంగా అందించాలో తెలియడం లేదని, ఉన్నతాధికారులు స్పందించి రేషన్ డీలర్ల బియ్యంలో కోతలు లేకుండా చూడాలన్నారు.

## బిజెపి కార్యకర్తలు ముందస్తు అరెస్టు




**ఉప్పునుంతల,జులై 20 ప్రభాతవార్త:** బాటసింగారం డబుల్ బెడ్‌రూంలు పరిశీలించడానికి కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పిలుపు మేరకు గురువారం బిజెపి కార్యకర్త లను వెళ్లకుండా ముందస్తుగా పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తరలించిన వారిలో హెడ్ కానిస్టేబుల్ వెంకోజీ, చిరంజీ వులు, అరెస్టు అయిన వారిలో మండల బిజెపి ప్రధాన కార్యదర్శి తోళ్ల మహేష్ యాదవ్, మండల సోషల్ మీడియా ఇంఛార్జి రవిచంద్ర, కార్యకర్తలు మద్ది శ్రీనివాస్‌గౌడ్,శ్రీశైలంగౌడ్, మల్లేష్, శ్రీనివాస్,శేఖర్, శివ, వెంకటయ్య, శివశంకర్ పాల్గొన్నారు.

### ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురు వర్షాల పట్ల

## జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: జిల్లా ఎస్‌పి రక్షిత

**వనపర్తి క్రైమ్, జూలై20, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న అకాల ముసురు వర్షాల కారణంగా జిల్లాలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రక్షిత కె.మూర్తి అన్నారు. ముసురు వర్షాల వల్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, పాత ఇండ్లు శిథిలావస్థలో ఉన్న నివాసాలలో ఉండే వారు అప్రమత్తంగా ఉండాలని, జిల్లా ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా పోలీస్ శాఖ తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో నిరంతరాయంగా కురుస్తున్న ముసురు వర్షాల వల్ల ప్రజలు ప్రమాదాలకు గురి కాకుండా పోలీస్ అధికారులు, సిబ్బంది తగిన ఏర్పాట్లతో చేపట్టవలసిన చర్యల గురించి జిల్లా ఎస్పీ టెలికాన్ఫరెన్స్ ద్వారా పలు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న చెరువులు, కుంటల అలుగుల దగ్గర, ప్రధాన రహదారులపై ప్రవహించే వాగులు, వంకల దగ్గర నీటి ప్రవాహం గురించి ముందస్తు సమాచారం తెలుసుకుని ప్రత్యక్షంగా వెళ్లి పర్యవేక్షించి పోలీసు అధికారులు, సిబ్బంది అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను, సిబ్బందిని ఎస్పీ ఆదేశించారు. భారీ వర్షాల వల్ల ఏదైనా విపత్కర సమస్య వస్తే లోకల్ పోలీస్ అధికారులకు లేదా డయల్ 100 లేదా జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 6303923200 కు సమాచారం అందించినచో తక్షణ సహాయక రక్షణ చర్యలు చేపడతామని ఎస్పీ తెలిపారు.

## అదనపు గదుల నిర్మాణానికి నిధులు మంజూరు..

**మదనాపురం, జూలై20, ప్రభాతవార్త:** మండల పరిధిలోని అజ్జకోలు గ్రామానికి జిల్లా పరిషత్ హై స్కూల్ అదనపు గది నిర్మాణానికి రూ.5 లక్షలు, అంగన్వాడీ 1వ సెంటర్‌కు రూ.5 లక్షలు, మార్కెట్ యార్డులో ఐకేపీ సెంటర్లో మినీ వాటర్ ట్యాంక్ రూ.2 లక్షలు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి సహకారంతో జిల్లా పరిషత్ నిధుల నుండి, జడ్పీటీసీ నిధుల నుండి మంజూరైన నిధుల ప్రొసీడింగ్ కాపీలను జడ్పీటీసీ కృష్ణయ్య యాదవ్‌కు గురువారం అందజేశారు. అనంతరం ఇద్దరికీ ఆసరా పింఛన్లను పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. మండల ఉపాధ్యక్షులు కరుణాకర్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు శాంతమూర్తి, సీనియర్ నాయకులు గుంటుపల్లి సవారన్న, వడ్ల బ్రహ్మయ్య, బోయిని శ్రీనివాసులు, చింతకాయల శ్రీనివాసులు, వడ్డె శ్రీనివాసులు, గొల్ల అశోక్, కరికె నాగేష్, శివరాములు, బస్టాండ్ బాలు , సురేందర్‌రెడ్డి, డ్యామ్ రాజు, శ్రీనివాసులు , ఐకేపీ సభ్యులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బిజెపి అధ్యక్షుడి అరెస్టును

## తీవ్రంగా ఖండించిన బిజెపి నాయకులు

**మద్దూరు, జూలై 20 ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి గురువారం బాటసింగాపురంలో తెలంగాణ ప్రభుత్వం నిర్మించినటువంటి డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించడానికి వస్తున్న రాష్ట్ర బిజెపి అధ్యక్షుని అరెస్టు చేసిన సందర్భంగా, కొత్తపల్లి మండల అధ్యక్షుడు బొబ్బిలి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ పాలనను కొనసాగిస్తుంది. డబుల్ బెడ్‌రూం ఇల్లు నాణ్యత లేదని, అవినీతి జరిగిందని, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పరిశీలించడానికి వస్తుంటే అరెస్టు చేయడం ఎందుకని ప్రశ్నించారు. మీరు నిజాయితీగా నిర్మిస్తే మీకు భయం ఎందుకు అన్నారు. టిఆర్‌ఎస్ ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకుని పాలన సాగిస్తుంది ఇలాంటి పాలన కోసమేనా మనం కొట్లాడి తెలంగాణను సాధించుకున్నది, ఇలాంటి ప్రజా వ్యతిరేక ప్రభుత్వం ఇంకా కొన్ని రోజులు మాత్రమని వచ్చే ఎన్నికల్లో రానున్న బిజెపి ప్రభుత్వం వస్తుందన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం చేసినటువంటి స్కాములు, అవినీతి తప్పకుండా బయటపెడుతుంది అన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి మండల బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్ పర్సన్‌గా

## పదవి బాధ్యతలు చేపట్టిన వేద రజిని సాయిచంద్





**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 20 ప్రభాతవార్త:** రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్న వేద సాయిచంద్ ఇటీవల హఠాన్మరం చెంద డంతో ఆయన స్థానంలో చైర్ పర్సన్ పదవిని సాయిచంద్ భార్య వేదరజనికి ప్రభుత్వం కేటాయించింది. వేదరజని సాయిచంద్ గురువారం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్‌పర్సన్‌గా పదవిబాధ్యతలు చేపట్టారు. వ్యవసాయశాఖ మంత్రిసింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, స్థానికసంస్థల ఎమ్మెల్సీ కసిరెడ్డినారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు మర్రి జనార్ధన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్యేలు, మంత్రులు వేద రజని సాయిచం ద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

## అలంపూర్‌లో నీలిజెండా ఎగరేద్దాం..

**ఇటిక్యాల, జూలై 20 ప్రభాతవార్త :** వచ్చే ఎన్నికల్లో అలంపూర్ నియోజకవర్గంలో నీలిజెండా ఎగురవేసేందుకు ప్రతి ఒక్కరు కలిసి ముందుకు రావాలని జిల్లా బీఎస్పీ పార్టీ ఇంఛార్జి ఎంజి కృష్ణ, అలంపూర్ తాలూకా అధ్యక్షుడు తిరుపాల్ ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని వల్లూరు గ్రామంలో నాలుగవ రోజు బీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో కళాకారులచే ధూంధాం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు యువరాజు మాట్లాడుతూ అలంపూర్ నియోజకవర్గంలో ఏ గ్రామం చూసినా బురదమయంగా మారిందని వర్షాకాలంలో ప్రజలు నడవలేని పరిస్థితిలో ఉన్నారని, చదువుకోవడానికి పాఠశాలలో మౌలిక వసతులు లేవని అదేవిధంగా బస్సు సౌకర్యాలు లేక ప్రజలు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని బిఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు నిరుద్యోగులు అవస్థలు పడుతున్నారని, రానున్న ఎన్నికల్లో అలంపూర్ నియోజకవర్గంలో బీఎస్పీ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని ధూం ధాం కార్యక్రమంలో ప్రజలకు కళాకారులు పిలుపునిచ్చారు. వర్షం సైతం లెక్కచేయకుండా ధూంధాం కార్యక్రమంలో పాల్గొని కళాకారుల ఆటపాట విన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇంఛార్జి ఎంజి కృష్ణ, నియోజకవర్గ అధ్యక్షులు తిరుపాల్, మండల అధ్యక్షులు యువరాజు, విజయ్, బివిఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులు అక్రమ అరెస్టులు చేయడం తగదు..

### బిజెపి మండల అధ్యక్షులు యాదగిరి సలేశ్వరం

**లింగాల, జూలై 20 ప్రభాతవార్త:** పోలీసులు బిజెపి నాయకులను అక్రమ అరెస్టులు చేయడం తగదని బిజెపి మండల అధ్యక్షుడు యాదగిరి సలేశ్వరం అన్నారు. గురువారం లింగాల మండల కేంద్రంలోని బిజెపి నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షులు యాదగిరి సలేశ్వరం మాట్లాడుతూ పేదలకు డబుల్ బెడ్‌రూం ఇవ్వాలని అడిగితే అక్రమ అరెస్టులు చేస్తారా అని ప్రశ్నించారు. దళితులకు మూడు ఎకరాల భూమి, నిరుద్యోగ భృతి, రైతులకు రుణ మాఫీ చేయలేదని, రాష్ట్రంలో ఇచ్చిన హామీలను నెరవేర్చని ప్రభుత్వాన్ని గద్దె దింపే రోజులు దగ్గర పడ్డాయన్నారు. అరెస్టయిన వారిలో బిజెపి ప్రధాన కార్యదర్శి దాసరి యాదయ్య, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు పసునూరి విష్ణుచారి, శక్తికేంద్రం ఇంచార్జి అశోక్ తదితరులు ఉన్నారు.

## ఎల్‌ఓసీ చెక్కు అందజేత...

**అచ్చంపేట, జూలై 20 ప్రభాతవార్త:** బల్మూర్ మండలం అనంతవరం గ్రామానికి చెందిన శ్రీనివాసులు అనారోగ్యానికి గురై నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటుండగా మెరుగైన వైద్య సేవల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2,50లక్షల ఎల్‌ఓసీ చెక్కును ప్రభుత్వ విఫ్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యానికి గురైన వారికి అన్ని విధాలుగా ప్రభుత్వ సహాయ సహకారాలు అందిస్తుందని, మెరుగైన వైద్యం అందించి ఆరోగ్యవంతులను చేసి వారి ఆరోగ్యాలకు బాసటగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు ఉన్నారు.

## కార్యకర్త కుటుంబాన్ని

## పరామర్శించిన ప్రభుత్వ విఫ్ ,అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల

**అచ్చంపేట, జూలై 20 ప్రభాతవార్త:** అమ్రాబాద్ మండలం తుర్కపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త పర్వతాలు బుధవారం సాయంత్రం వెంకటేశ్వర్ల బావి గేటు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ కుటుంబ సభ్యులు రోడ్డుపై భైఠాయించిన విషయం తెలుసుకున్న ప్రభుత్వ విఫ్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అక్కడికి చేరుకొని కార్యకర్త మృతదేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రభుత్వం తరుపున, పార్టీ తరుపున ఆదుకొని అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఎమ్మెల్యే హామీతో మృతదేహన్ని అచ్చంపేట ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి..

### - జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ అధికారి రవిశంకర్

**వనపర్తి వైద్య విభాగం, జూలై20, ప్రభాతవార్త:** వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాతావరణ మార్పుల ఫలితంగా సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగ్యూ , టైఫాయిడ్, చికెన్ గున్యా తదితర వ్యాధులతో పాటు విష జ్వరాలు వచ్చే అవకాశం అధికంగా ఉంటుందని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వేడి నీటిని తాగాలని జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారి రవిశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దోమలు కుట్టకుంట జాగ్రత్తలు తీసోవాలని, సురక్షితమైన నీటిని తాగాలని చిన్నపాటి జ్వరం వచ్చిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు. ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు అంగన్వాడీ కార్యకర్తలు గ్రామీణ పట్టణ ప్రాంతాలలో అందుబాటులో ఉంటారని, గర్భిణీ స్త్రీలు ఏదైనా ఇబ్బంది కలిగితే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ టోల్ ఫ్రీ నంబర్ 7386994079 ను సంప్రదించాలని ఆయన తెలిపారు.

# కాంగ్రెస్ పాలనలో రైతుల గోస..!

**చిన్నచింతకుంట, జూలై 20 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పాలనలో రైతుల సంక్షేమాన్ని విస్మరించి ఆకలి కేకలకు కారణమయ్యారని జడ్పీ ఛైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి విమర్శించారు. గురువారం మండల పరిధిలోని పర్దీపూర్ గ్రామ క్లస్టర్ పరిధిలోని రైతువేదిక వద్ద వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కెటిఆర్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా రైతులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్పీ ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం బిఆర్‌ఎస్ ప్రభుత్వం వినూత్న పథకాలతో అద్భుత విజయాలు సాధిస్తుంటే, మరోపక్క కాంగ్రెస్ నాయకత్వం వ్యవసాయానికి మూడు గంటల కరెంటు చాలని అంటున్నారని ఆమె విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు 20కి పైగా పెండింగ్ ఉన్న ప్రాజెక్టులను పూర్తిచేసి, 46 వేల చెరువులను బాగుచేసి, వేలాది చెక్‌డ్యాములు నిర్మించింది కెసిఆర్ ప్రభుత్వం అన్నారు. ఈ తొమ్మిదేండ్లలో తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా చేసిన ఘనుడు సీఎం కెసిఆర్ అన్నారు. తెలంగాణను మొత్తం 2,604 వ్యవసాయ క్లస్టర్లుగా చేసి, ఒక్క క్లస్టర్‌ను రైతువేదిక నిర్మించి, ఒక ఏఈఓను నియమించి, గ్రామ గ్రామాన రైతుబంధు కార్యకర్తలను ప్రవేశపెట్టి రైతు ఇంటిముందు వ్యవసాయ శాఖను నిలబెట్టింది ప్రభుత్వం. ఈ విధంగా ముఖ్యమంత్రి కెసిఆర్ గత తొమ్మిదేళ్లలో వ్యవసాయరంగాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి రైతున్నకు భరోసా కల్పించారన్నారు. కటిక చీకట్ల కాంగ్రెస్ తరిమికొడదాం, రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్న సీఎం కెసిఆర్ అండగా నిలుద్దామన్నారు. 3 గంటలే కరెంటు చాలంటున్న కాంగ్రెస్ మాకొద్దు సీఎం కెసిఆర్ నాయకత్వంలో 24 గంటల విద్యుత్‌తో ఏటా మూడు పంటలే ముద్దు అని తెలంగాణలోని రైతులు అంటున్నారన్నారు. కార్యక్రమంలో మండల రైతు కో ఆర్డినేటర్ మన్యంగౌడ్, పర్దీపూర్ సర్పంచ్ కోట సుప్రియ రాములు, మండల ఎంపిపి హర్షవర్ధన్, జడ్పీటిసి వట్టెం రాజేశ్వరి రాము, విండో ఛైర్మన్లు ఉమామహేశ్వర్‌రెడ్డి, సురెందర్‌రెడ్డి, కురుమూర్తి దేవస్థాన ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి, దేవరకద్ర మార్కెట్ కమిటి వైస్ ఛైర్మన్ దశరథ్‌రెడ్డి, ఎంపిటిసి శ్రీదేవి సాయిలు, పర్దీపూర్ గ్రామ పార్టీ అధ్యక్షులు వి. శ్రీనివాస్‌గౌడ్, మండల నాయకులు స్వామి, రంజిత్‌రెడ్డి, రంగారెడ్డి, నర్సిములు, కెసి నర్సింహా, సీతారాంపేట్, నెల్లికొండి పర్దీపూర్, గోప్యానాయక్ తండా గ్రామ రైతులు, నాయకులు పాల్గొన్నారు.



ఉచిత విద్యుత్‌కు మద్దతుగా రైతులు

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..!

**ఆస్తినష్టం, ప్రాణనష్టం వంటివి**
**కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి**
**జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్**
**ఏర్పాటుజిల్లా కలెక్టర్ జి. రవినాయక్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 20 ప్రభాతవార్త:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా జిల్లాలో ప్రాణనష్టం, పశునష్టం కలగకుండా, అదేవిధంగా అన్ని రకాలుగా ఎక్కువ నష్టం కలగకుండా చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ జి. రవినాయక్ అన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో గురువారం ఆయన సంబంధిత జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. లోతట్టు ప్రాంతాలలో ప్రజలు వర్షాల వల్ల ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలు, తండాలు, మున్సిపాలిటీలలో పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని, మురికి కాలువలు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ప్రజలు వర్షాల వల్ల అనారోగ్యం పాలై ఇబ్బందులు పడకుండా చూడాలని, తండాలు, గ్రామాలలో ఉండే గర్భిణీ స్త్రీలను ముందుగానే గుర్తించి వారి ప్రసవాలకు ఇబ్బంది కలగకుండా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. వర్షాల వల్ల వచ్చే జబ్బులకు చికిత్స అందించేలా చూడాలన్నారు. వర్షం కారణంగా అన్ని రహదారులు పొంగి పొర్లే ప్రమాదం ఉన్నందున ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగుతాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని ముందుగానే ఎక్కడైనా రోడ్లపై వర్షపునీరు పొంగి పొర్లుతున్నట్లయితే ఇతర ప్రాంతాల గుండా ట్రాఫిక్‌ను మళ్లించాలని, ఇందుకు పోలీస్ సహకారం తీసుకోవాలని, వాగులు, వంకలు పొంగిపొర్లే చోట రహదారులపై నీరు ప్రవహించే చోట ఎవరు వెళ్లకుండా బారికేడింగ్ ఏర్పాటు చేయాలని, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బి, పోలీస్ అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్ అధికారులు అన్ని చెరువులను ఎప్పటికప్పుడు సందర్శిస్తూ వర్షం కారణంగా ఎంతవరకు నిండాయో వివరాలు సమర్పించడమే కాకుండా, ఎక్కడైనా చెరువులు, వాగులు తెగిపోయేందుకు సిద్ధంగా ఉన్నచోట ఇసుక బస్తాలను సిద్ధం చేయాలని, ఎక్కడైనా తెగిపోతే తక్షణమే ఇసుక బస్తాలతో వాటిని పూడ్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గజ ఈతగాళ్లను సిద్ధం చేయాలని, లోతట్టు ప్రాంతాలు, చెరువులు, వంకల్లో మత్స్యకారులు చేపలు పట్టేందుకు వెళ్లవద్దని, ముఖ్యంగా గ్రామాల్లో పిల్లలు, చెరువులకు వెళ్లి చేపలు పట్టకుండా చూడాలని ఆదేశించారు. వర్షం కారణంగా తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని మిషన్ భగరథ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 100 శాతం నిరంతర విద్యుత్ సరఫరా అందించేలా చూడలని ఎక్కడైనా గాలికి వర్షానికి చెట్లుపడి వైర్లు తెగిపోయినట్లయితే తక్షణమే వాటిని పునరుద్దరించేలా చర్యలు చేపట్టాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈని ఆదేశించారు. వర్షాల వల్ల వ్యవసాయ పంటలు, ఉద్యాన పంటలు దెబ్బ తినకుండా వ్యవసాయ అధికారులు, ఉద్యానశాఖ అధికారులు రైతుల పొలాలకు వెళ్లినీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు కిందికి వెళ్లిపోయే విధంగా రైతులను అప్రమత్తం చేయాలని, వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. వర్షంలో ప్రజలు అనవసరంగా బయటకు వెళ్లకూడదని, అత్యవసరమైతేనే బయటికి వెళ్లకూడదని, అత్యవసరమైతేనే బయటికి వెళ్లాలని, ఇందుకు ప్రజలందరూ సహకరించాలని, వర్షం వల్ల ఇబ్బంది పడితే కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్ 08542 241165కు తెలియజేయాలని కోరారు. పాఠశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించినందున విద్యార్థులు బయటికి రావొద్దని కోరారు. జిల్లా ఎస్పీ కె.నరసింహ మాట్లాడుతూ రెండు రోజుల్లో ఇంకా వర్షాలు పెరిగే అవకాశం ఉన్నందున జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్‌హెచ్‌ఓలను అప్రమత్తం చేయడం జరిగిందని, వర్షం కారణంగా పెద్ద నిడివిగల జాతీయ రహదారిపై ప్రమాదాలకు అవకాశం ఉన్నందున ఇబ్బంది ఏర్పడకుండా ఎస్‌హెచ్‌ఓలు అప్రమత్తంగా ఉండి హైవేపై పర్యవేక్షించాలని ఆదేశించారు. ఏవైనా ఇబ్బందులు ఏర్పడినట్లయితే ప్రజలు డయల్ 100కు ఫోన్ చేయాలని, 24 గంటలు ఇది పని చేస్తుందని ఆయన వెల్లడించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే మాట్లాడుతూ నిరంతరంగా కురుస్తున్న వర్షాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేయడం జరిగిందని, తాను ఎప్పటికప్పుడు వర్షంపు టెలికాన్ఫరెన్స్ నిర్వహించడం జరుగుతున్నదన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు మాట్లాడుతూ వర్షానికి సంబంధించిన సమాచారంతో పాటు, ఎప్పటికప్పుడు నివేదికలను సమర్పించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. డిఎంహెచ్‌ఓ డా. కృష్ణ, వ్యవసాయ శాఖ అధికారి వెంకటేష్, హార్టికల్చర్ అధికారి సాయిబాబా, ఎలక్ట్రిసిటి ఎస్‌ఈ మూర్తి, ఇరిగేషన్ ఎస్‌ఈ చక్రధరం, మిషన్ భగీరథ ఎస్‌ఈ వెంకటరమణ తదితరులు మాట్లాడారు.

# చెక్‌డ్యాం నిర్మాణాన్ని తొలగించాలి..

### లేనిపక్షంలో బిజెపి ఆధ్వర్యంలో ఉద్యమిస్తాం

**చిన్నచింతకుంట, జూలై 20 ప్రభాతవార్త :** ఊకచెట్టువాగుపై వంతెన నిర్మాణం ఎన్నో ఏళ్లుగా మండల ప్రజల ఆకాంక్ష. కానీ చెక్‌డ్యాం నిర్మాణం మాకు అవసరం లేదని మండల కేంద్ర ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. ఈ చెక్ డ్యాం నిర్మాణం వల్ల ఊరు వాగు గడ్డకే అటాచ్‌తో ఉంటుందని, చెక్ డ్యాం నిర్మించడం వల్ల స్మశాన వాటిక నీటితో నిండే ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఊకచెట్టు వాగుపై చెక్ డ్యామ్‌లు నిర్మాణాలు ఊరికి దూరంగా చేపట్టడం వల్ల ఆ గ్రామాలకు లాభం చేకూరుతుంది. వర్షాకాలంలో వరద పారితే మళ్లీ వర్షాకాలం వరకు నీటి సమస్య ఉండదు. ఈచెక్ డ్యాం నిర్మాణం వల్ల వరద నీళ్లు ఆగితే వాగులో ఉన్న బావులు కలుషితం అవుతాయని తద్వారా రోగాల బారిన ప్రజలు పడతారని బిజెపి నాయకులు నంబిరాజు, కురువ రమేష్, దశరథ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం వాగులోని చెక్‌డ్యామ్ నిర్మాణం వద్ద వంతెన కాంట్రాక్టర్‌తో బిజెపి నేతలతో పాటు గ్రామస్తులు వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ వాగులో వరద నీళ్లు ఆగడంతో రెండో వార్డు నుంచి ఏడో వార్డు వరకు వాగుగడ్డకు ఆనుకుని ఉన్న ఇళ్లకు అనేక రకాల దోమలతో ఇబ్బందుల పాలవుతారని వారు తెలిపారు. మండల కేంద్ర ప్రజలందరూ వాగు నీటిపై ఆధారపడి జీవిస్తున్నారని, చెక్‌డ్యాం కట్టడం వల్ల మురుగునీరు నిలవడంతో అనేక రకాల ఇబ్బందులు పడాల్సి వస్తుందని మాకు ఇంతవరకు స్మశాన వాటిక లేదు, వాగులో ఉన్న స్మశాన వాటిక ఎస్సీ కాలనీ నుంచి హిందూ స్మశాన వాటిక వారకు ఆయా సామాజిక వర్గాలు వాగులోని శవాలను పూడ్చుకుంటారని చెక్ డ్యామ్ వల్ల ఆగిన నీటితో స్మశాన వాటిక నీళ్లలో ఉండడంవల్ల శవాలు కుళ్లిపోయి అవే నీళ్లు మళ్లీ బావిలోకి రావడం వల్ల ప్రజలు ఈ నీళ్లనే తాగడం వల్ల పలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. కాంట్రాక్టర్‌కు చెక్‌డ్యాం వద్దు అని ఎన్నిసార్లు చెప్పినా పై అధికారుల దృష్టికి తీసుకుపోకుండా అలాగే చెక్‌డ్యాం నిర్మాణం చేశారని బిజెపి నేతలు ఆరోపించారు. ఇప్పుడు వాగు అంచుకు మట్టితో కరకట్ట నిర్మాణం చేయబోతున్నారు. మాకు చెక్‌డ్యామ్ అవసరం లేనప్పుడు మట్టిమొరం పోసి నిర్మిస్తున్న కరకట్ట అవసరం లేదని బిజెపి నేతలతో పాటు గ్రామస్తులు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. మా గ్రామ ప్రజలకు పర్యాటక కేంద్రంగా ఉన్న వాగును అపరిశుద్ధం చేయకుండా మాకు వస్తున్నటువంటి స్వచ్ఛమైన తాగునీరును కలుషితం కాకుండా చూడాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. కావున దీనిపై అధికారులు వెంటనే స్పందించాలని లేనిపక్షంలో బిజెపి ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని నేతలు హెచ్చరించారు.



కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్న బిజెపి నాయకులు

# అరెస్టులు అప్రజాస్వామికం..

### - బీఆర్‌ఎస్ అవినీతి ప్రభుత్వం..- బీజేపీ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై20, ప్రభాతవార్త :** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి డబుల్ బెడ్రూం సందర్శనలకు వెళ్తే అడ్డుకోవడం, అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ అరెస్టు చేయడం సరికాదని, ప్రజాస్వామ్యాన్ని ఖూని చేయడమే అన్నారు. కిషన్ రెడ్డి అరెస్టును ఖండిస్తూ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబుల్ బెడ్రూం ఇండ్ల విషయంలో అవినీతి జరగకుంటే కేసీఆర్‌కు ఎందుకు భయమేస్తుందని, ఇండ్లను చూడడానికి ఎందుకు వెళ్లనివ్వరని ప్రశ్నించారు. డబుల్ బెడ్రూం ఇండ్లల్లో పెద్దఎత్తున అవినీతి జరిగిందని స్పష్టంగా అర్థమవుతుందన్నారు. ఈనెల24న జిల్లా కేంద్రం లో, అనంతరం రాష్ట్రస్థాయిలో పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని వెల్లడించారు. తెలంగాణలో ప్రశ్నించే గొంతులను అణచివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో డబుల్ బెడ్రూం ఇండ్ల సాధనకు బీజేపీ పోరుబాట కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. అమాయక ప్రజలను మోసం చేస్తూ అధికారంలోకి వచ్చి నేటికీ పేదలకు ఇండ్లు ఇవ్వడం లేదని పేర్కొన్నారు.



ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ శ్రేణులు

# ఉపాధ్యాయుల సెలవుల నిర్వహణ సరిగ్గా చేపట్టాలి..

### - శిథిలావస్థ గదుల్లో విద్యార్థులకు కూర్చోబెట్టరాదు: డీఈవో రవీందర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 20, ప్రభాతవార్త :** ఇక నుంచి సెలవుల నిర్వహణ ఆయా పాఠశాలల స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతి నెలా 5వరకు జిల్లా కార్యాలయానికి ఉపాధ్యాయులు సెలవులు వాడుకున్న వివరాలను పంపించాలని డీఈవో రవీందర్ సూచించారు. గురువారం సమగ్ర శిక్ష సమావేశ మందిరంలో మండల విద్యా శాఖ అధికారులకు, ఎఫ్‌ఎల్‌ఎన్ మండల నోడల్ అధికారులకు నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్ మాట్లాడుతూ ఇక నుంచి ఉపాధ్యాయుల సెలవుల నిర్వహణ ఆయా పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం నిర్వహించాలని, ప్రతి నెల 5వరకు సెలవుల వివరాలు పంపించాలని ఆదేశించారు. ఇక నుంచి ఉపాధ్యాయులు వాడుకునే అన్ని రకాల సెలవులు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి తెలియజేయాలని, సర్వీస్ రికార్డులో నమోదు చేయాలని తెలిపారు. అదేవిధంగా ప్రమాదకర భవనాల్లో విద్యార్థులను కూర్చోబెట్టొద్దని అలాంటి శిథిలావ్థలో ఉన్న భవనాల వివరాలను తమకు తెలియజేయాలని సూచించారు. విద్యార్థుల వివరాలను యూ డైస్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులకు అందిన ఏకరూప దుస్తులు, పుస్తకాలపై సమీక్ష నిర్వహించారు. ప్రతి శనివారం నో బ్యాగ్ డే ను ఖచ్చితంగా నిర్వహించాలని సూచించారు. పాఠశాల తనిఖీలను పర్యవేక్షణాధికారులు స్కూల్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు, ఎఫ్‌ఎన్‌ఎల్ నోడల్ అధికారులు, మండల విద్యాశాఖాధికారులు, సమగ్ర శిక్ష అధికారులు సమన్వయంతో పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు. జిల్లాలో అన్ని పాఠశాలలో బోధనాభ్యసన కృత్యాలు సమర్థవంతంగా నిర్వహించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఆదేశించారు. ఈ నెల 23 సాయంత్రం మహబూబ్‌నగర్‌లో నిర్వహించే డ్రోన్ షోకు పట్టణంలోని అన్ని పాఠశాలల 8నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు హాజరయ్యేలా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష సమన్వయ అధికారులు బాలుయాదవ్, బైకాని గోవర్ధన్‌గౌడ్, దుంకుడు శ్రీనివాస్, పల్లవి, శ్రీకాంత్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రవీందర్ (ఇన్‌సెట్లో)
హాజరైన ఎంఈవోలు, నోడల్ అధికారులు

## అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కుమార్ దీపక్

మొదటి పేజీ తరువాయి భాగం..

అభివృద్ధి పనుల పర్యవేక్షణతో పాటు గ్రామాలు, పట్టణాలు పచ్చదనం పరిశుభ్రతకు అధిక ప్రాధన్యత ఇవ్వనున్నట్లు నూతనంగా బాధ్యతలు చేపట్టిన అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ ఈ సందర్భంగా తెలిపారు. నూతన అదనపు కలెక్టర్‌ను కలిసిన వారిలో ముఖ్య ప్రణాళిక అధికారి భూపాల్‌రెడ్డి, డీఆర్డీఏ పీడీ నర్సింగరావు, జిల్లా పంచాయతీ అధికారి కృష్ణ, డీఈఓ గోవిందరాజులు, జెడ్పీ సీఈఓ ఉష తదితరులు ఉన్నారు.

## మంచిగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

### అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్

**నారాయణపేట ప్రతినిధి, జూలై 20 ప్రభాతవార్త:** ప్రభుత్వం కల్పించే సదుపాయాలతో విద్యార్థులు మంచిగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో షెడ్యూల్ క్యాస్ట్ వెల్ఫేర్ స్కూల్‌లకు విద్యార్థుల ఎంపిక డిప్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్ తీసి అదనపు కలెక్టర్ విద్యార్థులను ఎంపిక చేయడం జరిగింది. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి పాల్గొన్నారు.



## బిజెపి నాయకుల ముందస్తు అరెస్టు..

**కెటిదొడ్డి, జూలై 20 ప్రభాతవార్త :** బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆదేశానుసారం బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ భరతసింహారెడ్డి పిలుపు మేరకు గురువారం మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అబద్ధాలతో కాలయాపన చేస్తున్న అసమర్థ బిఆర్‌ఎస్ ప్రభుత్వ పాలకులు గతంలో ఇచ్చిన హామీలలో భాగంగా రెండు పడక గదుల ఇళ్లు ఎక్కడెక్కడ నిర్మించారో తెలుసుకోవడానికి వెళ్తున్న బిజెపి కార్యకర్తలను రాత్రికి రాత్రే పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడం సరైన పద్ధతి కాదని ప్రశ్నించే గొంతులను, ప్రజల ఆవేదన, ఆక్రోశం బిజెపి నేతల అరెస్టులతో తగ్గదన్నారు. ప్రజల సమస్యల తరపున యుద్ధం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే మండలనాయకులను ముందస్తుగా అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్‌కు తీసుకురావడం జరిగింది. బిజెపి నాయ కులు జి.శ్రీనివాసులు, తిరుపతి, అశోక్, సురేష్, నర్సింహులు, కార్యకర్తలు ఉన్నారు.



## కమాండెంట్‌గా సాంబయ్య పదవి బాధ్యతలు

**ఇటిక్యాల, జూలై 20 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో గల పదవ బెటాలియన్‌లో కమాండెంట్‌గా ఎన్‌వి సాంబయ్య పదవి బాధ్యతలు చేపట్టారు. బదిలీలలో భాగంగా నల్లగొండ జిల్లా 12వ అన్నేపర్తి బెటాలియన్ నుండి బదిలీపై ఎర్రవల్లి పదవ బెటాలియన్‌కు వచ్చారు.



## బిజెపి నాయకుల ముందస్తు అరెస్టు

**ఇటిక్యాల, జూలై 20 ప్రభాతవార్త :** డబుల్ బెడ్‌రూం ఇండ్లు పరిశీలనకు బిజెపి పార్టీ చలో బాటసింగారం కార్యక్రమానికి పిలుపు ఇవ్వగా కార్యక్రమానికి తరలి వెళ్లకుండా ముందస్తుగా మండల బిజెపి నాయకులను, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల అదుపులో ఉన్నవారిలో బిజెపి నాయకులు అబ్దుల్లా, జగదీశ్‌రెడ్డి, తిమ్మారెడ్డి, కిశోర్, మాణిక్యరెడ్డి, బిసిరెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



## నూతన సిఐ రాజును కలిసిన కాంగ్రెస్ నాయకులు

**ఇటిక్యాల, జూలై 20 ప్రభాతవార్త :** అలంపూర్ నూతన సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా రాజు పదవి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా గురువారం కాంగ్రెస్ నాయకులు అలంపూర్ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎర్రవల్లి సర్పంచ్ రవి, ఉపసర్పంచ్, పద్మా వెంకటన్న, వెంకటేష్, రాజ్‌కుమార్, రాముడు, రవి, పరశురాం, వెంకటేష్, రవి తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను సన్మానించారు.